

ఇన్నాళ్లకు గుర్తొచ్చానా వానా!



నిడదవోలులో కురుస్తున్న వాన



గోపాలపురంలో జలమయంగా మారిన లోతట్టు ప్రాంతం

నిడదవోలు/గోపాలపురం

నిన్నటి వరకూ భానుడు వదల్లేదు..వరుణ జాడలేదు.. ఒక పక్క జనం ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు.. ఈ కాలంలో ఇదేంటిరా దేవుడా అంటూ ఆపసోపాలు పడుతున్నారు.. ఉదయం నుంచి సాయంత్రం ఏదో ఎండాకాలంలా ఉంటుంది. బుధవారం రాజమహేంద్రవరం 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. జనం బయటకు రావడానికే భయపడుతున్నారు.. అటువంటిది గురువారం రెండు ప్రాంతాలను వరుణుడు కరుణించాడు.. నిడదవోలులో గురువారం ఉదయం నుంచి భానుడి భగభగలతో జనం ఉక్కపోతకు గురయ్యారు.. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పువచ్చింది.. సుమారు గంట సేపు వరుణుడు దంచికొట్టాడు.. గోపాలపురంలోనూ వరుణుడు సాయంత్రం 4 గంటల నుంచి చితక్కొట్టాడు.. కాస్త చల్లబడడంతో ఆ రెండు మండలాల్లో జనం ఊపిరిపీల్చుకున్నారు.

కార్డు ఉంటేనే ఓకే!

ఏఎంసీ చెక్‌పోస్టుల్లో డిజిటల్ సేవలు ఆరంభం

పెరవలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో డిజిటలైజేషన్ వైపు అడుగులు పడుతున్నాయి.ఎక్కడైతే డిజిటల్ సేవలు అందుబాటులో లేవో గుర్తించి ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకూ ఏఎంసీ చెక్‌పోస్టుల్లో డిజిటల్ చెల్లింపుల విధానం లేదు. ఇదిలా ఉండగా పెరవలి ఏఎంసీ చెక్‌పోస్టు వద్ద డిజిటల్ చెల్లింపుల పైలెట్ ప్రాజెక్టును గురువారం కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించి మాట్లాడారు. మార్కెట్ యార్డుల్లో నగదు లేని పారదర్శక విధానికి తెరలేపామన్నారు. ఇప్పటి వరకు చెక్కుపోస్టుల్లో నగదు రూపంలో వసూలు చేసిన మార్కెట్ ఫీజును ఇకపై ఈ పోస్ యంత్రాలు ద్వారా మాత్రమే వసూలు చేస్తారని.. డిజిటల్ రశీదు అందుతుందన్నారు. దీని వల్ల ఆదాయంలో పారదర్శకత పెరిగి, కమిటీల ఆదాయం గణనీయంగా పెరుగుతుందన్నారు.కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ మార్కెట్ ఫీజుల డిజిటల్ వసూలు విధానం ద్వారా ఆదాయ లక్ష్యాలను వంద శాతం చేరుకోవచ్చన్నారు. నకిలీ రశీదుల వల్ల జరిగే అక్రమాలకు చెక్‌పడుతుందన్నారు.కార్యక్రమం లో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, జనసేన మండల అధ్యక్షుడు పిప్పర రవి, టీడీపీ నాయకులు అతికాల శ్రీను, వీరవల్లి శ్రీను,సలాది కృష్ణమూర్తి పాల్గొన్నారు.




పెరవలి ఏఎంసీ చెక్‌పోస్ట్ వద్ద డిజిటల్ సేవలు ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్



పట్టాదారు.. పాస్!

మళ్లీ మంచి రోజులు..



జగన్ బొమ్మతో జారీ చేసిన పాస్‌బుక్‌లను నిలిపివేసి ఆంధ్రప్రదేశ్ రాజముద్రతో కొత్త బుక్‌లను ప్రభుత్వం సిద్ధం చేసింది. వీటిని ఆగస్టు 15న రీసర్వే పూర్తయిన గ్రామాల్లో పంపిణీ చేయబోతోంది. ఇప్పటికే ఇవన్నీ ఆయా జిల్లా కలెక్టర్ కార్యాలయాలకు చేరుకున్నాయి. కాకినాడ జిల్లాకు మొత్తం 1.47 లక్షలు, కోనసీమ 1.02 లక్షలు, తూర్పుగోదావరి జిల్లాకు 95 వేల వరకు వచ్చాయి. వీటిని ఆయా మండలాలకు తరలించి రైతులకు పంపిణీ చేయనున్నారు. ఒక రకంగా చెప్పాలంటే అనేక ఏళ్ల తర్వాత మళ్లీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తళతళలాడే పాస్‌బుక్‌లు రైతులకు అందబోతున్నాయి. ఈ పాస్ బుక్‌లపై క్యూఆర్‌కోడ్‌తోపాటు ఆధార్ నెంబరు ఉంటుంది. దీని ఆధారంగా ప్రతి యజమాని తమ సొంత భూమి వివరాలు తెలుసు కునే వెసులు బాటును ప్రభుత్వం కల్పించింది. మరో పక్క పంపిణీ చేసిన పాస్ పుస్తకాల్లో తప్పులుంటే వెనక్కు తీసుకుని మళ్లీ కొత్తవి జారీ చేయనున్నారు. కొత్త పాస్‌బుక్‌లతో భూ య జమానుల సమస్యలు తీరనున్నాయి.

ఈ నెల 15 నుంచి కొత్త పాస్‌బుక్‌లు

- ఉమ్మడి జిల్లాలో పంపిణీకి శ్రీకారం
- 3.44 లక్షల పాస్ పుస్తకాలు రాక
- గతంలో జగన్ బొమ్మతో జారీ
- రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత
- కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదులు
- మళ్లీ రాజముద్రతో పాస్‌బుక్‌లు
- నేడో రేపో రైతులకు అందజేత

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 15 నుంచి రైతులకు కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీకి రంగం సిద్ధమవుతోంది. భూసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు కొత్త పాస్ పుస్తకాలను అధికారులు అందించనున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ బొమ్మతో రైతులకు పాస్ పుస్తకాలు అరకొరగా ఇవ్వడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో వీటి పంపిణీకి బ్రేక్ పడింది.ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మునుపటిలా ఆంధ్రప్రదేశ్ రాజ ముద్రతో కొత్త పాస్‌పుస్తకాల జారీకి రెవెన్యూ శాఖ నిర్ణయించింది. ఎట్టకేలకు ఇవన్నీ జిల్లాలకు చేరుకున్నాయి. ఆగస్టు 15న వీటిని రీసర్వే పూర్తి చేసుకున్న గ్రామాల్లో పంపిణీ చేయనున్నారు.

నేటికీ 1920 నాటి లెక్కలే..

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ,ప్రైవేటు భూముల సర్వే 1920లో జరిగింది. దీని ప్రకారమే 2022 వరకు భూ లావాదేవీలు జరిగాయి.వాస్తవానికి 1920లో జరిగిన భూసర్వే 30 ఏళ్ల పాటు మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలి.ఆ తర్వాత మళ్లీ భూ రీసర్వే జరగాలి. కానీ అనేక కారణాలతో సర్వే జరగలేదు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు భూమి ఏదైనా సరే వివాదం తలెత్తితే 1920 నాటి రీ సర్వే రిజిస్టర్ (ఆర్ఎస్ఆర్) మాత్రమే రెవెన్యూ శాఖకు ప్రామాణికంగా మారింది. ఈ వందేళ్లలో అనేక మార్పులు వచ్చాయి. కానీ ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం వందేళ్ల కిందట స్థితిగతుల ప్రకారమే కొనసాగుతున్నాయి.మరో పక్క ఎక్కడైనా వందెకరాల భూమి ఉంటే దానికి ఏకమొత్తంగా ఒకే సర్వే నెంబర్ మాత్రమే కొనసాగుతోంది. ఈ సర్వే నెంబర్‌లో యాభై,అరవై మందికి భూమి ఉంటుంది. వీరు క్రయవిక్రయాలు జరిపితే ఒకే సర్వే నెంబరే అందరికీ ప్రామాణికంగా కొనసాగుతోంది. దీని వల్ల అనేక భూ వివాదాలు తలెత్తుతున్నాయి.

40 వేల మంది విజ్ఞప్తులు..

గత వైసీపీ ప్రభుత్వంలో రెవెన్యూ శాఖ అస్తవ్యస్తంగా మారింది. రైతుల భూములు కొనుగోలు చేసి ఏళ్లు దాటినా పాస్ బుక్‌లు అరకొరగా ఇచ్చారు. వాస్తవానికి ఇవి ఉంటేనే భూముల క్రయవిక్రయాలు సాగుతాయి. రైతులకు రుణాలు వస్తాయి.కానీ జగన్ సర్కారు అప్పట్లో ఇదేదీ పట్టించుకోలేదు. పాస్ పుస్తకాల కోసం తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ రైతులు కాళ్లరిగేలా తిరిగినా ఖాతరు చేయలేదు. అదే సమయంలో అప్పటి ప్రభుత్వం కొత్తగా 2022 సమగ్ర భూ సర్వే చేపట్టి అరాచకం సృష్టించింది. దీనిపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విసిగెత్తిపోయిన 40 వేల మందికిపైగా బాధితులు న్యాయం చేయాలంటూ కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందించారు. వీటిపై ప్రభుత్వం దృష్టి సారించి గ్రామాల వారీగా బాధితుల సమస్యలు వింటూ తిరిగి రీసర్వే చేపట్టింది. రీసర్వేలో సంబంధిత భూయజమానులకు ముందే సమాచారం ఇచ్చి సర్వే చేపట్టారు.ఇలా ఉమ్మడి జిల్లాలో 600 గ్రామాల్లో సమస్యలు చాలా వరకు పరిష్కరించారు.

600 గ్రామాల్లో అస్తవ్యస్తం..

గత వైసీపీ ప్రభుత్వం సమగ్ర భూ సర్వే చేయ డానికి కసరత్తు జరిపింది. ఒక్కో సర్వే నెంబర్‌లో ఎంత మందికి భూములున్నాయనేది గుర్తించి ఆ సర్వే నెంబర్‌లో ఉన్న వారందరికి కొత్తగా సబ్‌డివిజన్ చేసి ప్రతి ఒక్కరికి ఉమ్మడిగా ఇంత కాలంగా ఉన్న సర్వే నెంబర్ స్థానంలో సబ్‌డివిజన్ సర్వే నెంబర్ కొత్తగా కేటాయించాలని నిర్ణయించింది. కానీ ఆచరణలో అప్పటి ప్రభుత్వం విఫలమైంది. సర్వేను వేగంగా పూర్తి చేయాలని ఒత్తిళ్లు తేవడంతో ఈ ప్రక్రియను రెవెన్యూసర్వేశాఖ అధికారులు అస్తవ్యస్తంగా మార్చేశారు.ఉమ్మడి జిల్లాలో ఆరు వందలకుపైగా గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశారు. కాకినాడ జిల్లా 15 మండలాల పరిధిలో 269 గ్రామాలు, తూర్పుగోదావరి జిల్లా 19 మండలాల్లోని 190 గ్రామాలు, కోనసీమ జిల్లాలో 150కి పైగా గ్రామాల్లో సర్వే చేశారు. భూయజమానులు లేకపోయినా పక్క స్థలాల యజమానులను అడిగి రీ సర్వే కానిచ్చేశారు. దీంతో వేలాది మంది భూముల విస్తీర్ణం చాలా వరకు తగ్గిపోయింది. మరి కొందరి విస్తీర్ణం అమాంతం పెరిగిపోయింది. రీసర్వే తప్పులతో భూయజమానుల పేర్లు సైతం మారిపోయాయి. వీటిని సరిచేయాలని వేలాదిగా బాధితులు కాళ్లరిగేలా తిరిగినా ప్రభుత్వం పరిష్కరించలేదు. సర్వే పూర్తయిన గ్రామాల్లో సొంత ప్రచారం కోసం జగన్ బొమ్మతో పాస్‌బుక్‌ల జారీకి అధికారులు ప్రయత్నించారు. ఇది తీవ్ర విమర్శలపాలైంది.





కడియం మండలం మురమండలో ర్యాలీ చేస్తున్న చేనేత కార్మికులు

జిల్లాలో 900 చేనేత మగ్గాలు

చేనేత దినోత్సవంలో హ్యాండ్లూమ్స్ అధికారి రవికుమార్

కడియం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేనేతను ఆదరిద్దాం... చేనేత వస్త్రాలను ధరించాలంటూ చేనేత కార్మికులు గురువారం నినాదాలు చేశారు. కడియం మండలం మురమండ చేనేత సొసైటీ వద్ద జాతీయ చేనేత దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. హేండ్‌లూమ్స్- కాకినాడ విస్తరణాధికారులు సీహెచ్. రవికుమార్,బి.తవిటినాయుడు మాట్లాడుతూ జిల్లాలో సుమారు 900 మగ్గాలు 2,500 మంది నేత కార్మికులు ఉన్నారని తెలి పారు. జిల్లాలో చేనేత కార్మికులకు రూ.13 లక్షల త్రిఫ్ట్ ఫండ్ నిధులు మంజూరయ్యాయన్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ మినహాయింపు కారణంగా సుమారు రూ.15 లక్షలు లబ్ధి కలుగుతుందన్నారు.అంతకు ముందుగా ఏఎంజీ రోడ్డు నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా ర్యాలీ చేశారు. పలువురు నేత కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘ నాయకులు కర్రా వీరభద్రరావు, కుందుం సత్యనారాయణ, యర్రా వీరభద్రుడు, బీరక వీరవెంకట సత్యనారాయణ, యర్రా సూర్యనారాయణ, బత్తుల గణేష్, కొండపల్లి పట్టియ్య,కూటమి నాయకులు ప్రత్తిపాటి రామారావుచౌదరి, యర్రంశెట్టి వీరబాబు, దేవళ్ల రాంబాబు, వట్టికూటి జానకీరామయ్య, సొసైటీ సీఈవో చింతా పోతురాజు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్లు ఓకేనా!

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అన్న కేంటిన్ల నిర్వహణ చాలా చోట్ల గాలికొదిలేశారు. దీంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.ఈ మేరకు కలెక్టర్ ప్రశాంతికి ఫిర్యాదు అందిందో ఏమో గురువారం ఉన్నట్టుండి రాజమహేంద్రవరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. టోకెన్ కౌంటర్, డైనింగ్ ఏరియా, చేతులు శుభ్రం చేసుకునే ప్రదేశాలను పరిశీలించారు. ఆహారం తీసుకుంటున్న వారితో కలెక్టర్ ప్రశాంతి మాట్లాడి భోజన నాణ్యత, పరిశుభ్రత, వసతుల లభ్యత, సమయ పాలన టోకెన్ల అందుబాటు తదితర అంశాలపై ప్రశ్నించారు. క్యాంటీన్ నిర్వహణ విషయంలో ప్రజల నుంచి అభిప్రాయాలు కూడా క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా సేకరించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఎక్కడైనా తేడా ఉంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మళ్లీ తనిఖీ చేస్తానని తెలిపారు.

64 వేల బంగారు కుటుంబాలు గుర్తింపు

సీఎస్ సమీక్షలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటి వరకు 64 వేల బంగారు కుటుంబాలను గుర్తించామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.అమరావతిలోని తన కార్యాలయం నుంచి జిల్లాల కలెక్టర్లతో సీఎస్ విజయానంద్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. పీ-4 సర్వే, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టిన ప్రాజెక్టులు, ప్రభుత్వ పథకాల అమలు, అన్నదాత సుఖీభవ తదితర అంశాలపై సమీక్షించారు.నీడ్ అసెస్మెంట్ సర్వే ఈ నెల 15లోపు 100 శాతం చేరాలని ఆదేశించారు.రాజానగరం మండలం కలవచర్లలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కులు నెల రోజుల్లో ప్రారంభిస్తామన్నారు.సమావేశం లో డీఆర్వో టీ.సీతారామమూర్తి డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గోకవరం ప్రభుత్వాసుపత్రిలో బాధితులు

జ్వరాలతో వణుకుతున్న గోకవరం

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వద్ద బాధితుల క్యూ

గోకవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సగానికి పైగా గ్రామాల్లో జనం జ్వరాలతో వణికిపోతున్నారు. వాతావరణ మార్పుల కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.జ్వరం, జలుబు, దగ్గు, ఒంటి నొప్పులు, వికారం, వాంతులు, విరేచనాలు, తదితర లక్షణాలతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. కొన్నిచోట్ల పారిశుధ్య లోపం, తాగునీరు క్లోరినేషన్, చేయకపోవడం తదితర కారణాలతో అనారోగ్యం బారినపడుతున్నారు. ఏ ఇంట్లో చూసినా ఎవరో ఒకరు రోగంతో బాధపడేవారే కనిపిస్తున్నారు. గోకవరం ప్రభుత్వాసుపత్రికి రోగులు వచ్చి జాయినవుతున్నారు. మరికొంత మంది ప్రభుత్వాసుపత్రికి వెళితే సరైన వైద్యం అందదేమోననే అపోహతో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం వైరల్ జ్వరాల వ్యాప్తి కనిపిస్తోందని అధికారులు చెప్పుకొస్తున్నారు. కొంత మంది ఆయా గ్రామాల్లో ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వాసుపత్రిలో రోజువారి ఓపీ సుమారు 300 నుంచి 400 వరకు ఉంటుంది. వీరిలో సగం మంది జ్వరం, రొంప, వాంతులు, విరోచనాలు, ఒంటి నొప్పులతో వస్తున్నవారే ఎక్కువగా కనిపిస్తున్నారు. వీరిలో చిన్నారులు కూడా ఉన్నట్టు సమాచారం. ప్రభుత్వాసుపత్రికి వెళితే గంటలు తరబడి నిరీక్షణ తప్పడం లేదని రోగుల సంబంధీకులు వాపోతున్నారు. ఓపీ రాయించుకున్నాక వైద్యుడి వద్దకు చేరుకోవడం ఒక ఎత్తయితే, రక్త పరీక్ష చేయించుకోవడం మరొక సాహసంగా మారుతుందని అంటున్నారు. ఏటా వర్షాకాలంలో జ్వరాల వ్యాప్తి ఉన్నా అరికట్టే దిశగా ప్రభుత్వ యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవడంలేదు. దీంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వ్యాపారులకు.. లక్ష్మీ కటాక్షం!

వరలక్ష్మీ వ్రత సామగ్రి అధరహో



- కొనుగోలుదారుడికి ధరాఘాతం
- గ్రాము రూపు రూ.10,500
- 30 చామంతులు రూ.50
- కొబ్బరికాయ రూ.40
- అరటిపండ్లు అత్తం రూ.100
- కిటకిటలాడిన మార్కెట్లు





రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 7 (ఆం ధ్రజ్యోతి) : జిల్లాలో శ్రావణ కళ వచ్చింది.. మార్కెట్ శ్రావణ శోభ సంతరించుకుంది. రెండో శ్రావణ శుక్రవారం సందర్భంగా గురువారం మార్కెట్లు కిటకిటలాడాయి. పూజా సామగ్రి కొనుగోళ్లకు జనం పోటెత్తారు. గత నెల 25వ తేదీ నుంచి శ్రావణమాసం ఆరంభమైంది. అప్పటి నుంచి శుభకార్యాలు ప్రారంభ మయ్యాయి. దుస్తులు, వెండి, బంగారు వస్తువుల కొనుగోళ్లు జరుగుతున్నాయి. శుక్రవారం వరలక్ష్మీదేవి వ్రతాన్ని పురస్కరించుకుని నిత్యావసరాలు, పండ్లు, పువ్వులు, బంగారు రూపులు, పత్రులతో మార్కెట్ నిండుగా మారింది. ఒక గ్రాము రూపు రూ.10,500ల వరకు పలకడంతో మహిళలు కొనుగోలుకు వెనుకంజ వేశారు. చాలా మంది అరగ్రాముతో సరిపెట్టారు. అయితే తరుగు మజూరీ దోపిడీ మాత్రం పెద్ద ఎత్తున సాగింది. అరగ్రాము రూపు రూ.6 వేల వరకు ధర పలికినట్టు సమాచారం. పువ్వుల ధరలు అంబరాన్నంటాయి.30 చామంతి పువ్వులు రూ.50లు పలికాయి. ఆరు గులాబీలు రూ.10, రెండు అరటిఆకులు రూ.10, కొబ్బరి కాయలు రూ.30 నుంచి రూ.40ల మధ్యలో పలికాయి. అరటి పండ్లు అత్తం రూ.100లు పలికింది. ఒక్కో కలువ పువ్వులు రూ.10లకు విక్రయించారు. నిత్యావసరాల ధరలు అమాంతంగా పెరిగాయి. యాపిల్ డజను రూ.600, బత్తాయి డజను రూ.300, ద్రాక్ష కేజీ రూ. 150 నుంచి రూ.200, బెల్లం కేజీ రూ.55 నుంచి రూ.65, ఆయిల్ ప్యాకెట్ కేజీ రూ.160 నుంచి రూ.180 పలికాయి. వరలక్ష్మీ వ్రతం చేస్తే లక్ష్మి రావడం ఏమో కానీ గురువారం జేబు మొత్తం ఖాళీ అయిపోయిందని పలువురు వాపోయారు. బంగారం ధర పెరిగినా దుకాణాలు కళకళలాడాయి. రాజమహేంద్రవరంలోని కంబాలచెరువు,దేవిచౌక్, జాంపేట పోలీస్ క్వార్టర్స్ రోడ్డు, దానవాయిపేట, ఏవీఏ రోడ్డు, క్వారీ రోడ్డు, పేపరు మిల్లు రోడ్డు, లాలాచెరువు, ఆర్టీసీ కాంప్లెక్స్, స్టేడియం రోడ్డు, కోటిపల్లి బస్టాండ్, కొవ్వూ రు, నిడదవోలు తదిరత ప్రాంతాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.మరో వైపు కడియపులంక పువ్వుల మార్కెట్ కళకళలాడింది. పువ్వుల కొనుగోళ్లు పెద్ద ఎత్తున సాగాయి. చామంతులకు డిమాండ్ ఏర్పడింది.

భక్త 'జన' గోదారి

గోదావరి రేవులు భక్తజనంతో కిటకిటలాడాయి.. శ్రావణ శుక్రవారం సందర్భంగా గురువారం పెద్ద ఎత్తున మహిళలు రాజమహేంద్రవరంలోని పుష్కరఘాట్‌కు చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. ఉదయం నుంచి ఘాట్‌కు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గోదావరిలో దీపాలు వదిలారు.



లైసెన్స్ లేని తుపాకులు కలిగి ఉండడం నేరం : ఎస్పీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ లేని తుపాకులు కలిగి ఉండడం చట్ట రీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ నరసింహ కిశోర్ హెచ్చరించారు. ఏ రకమైన మారణాయుధాలు కలిగి ఉన్నా ఉపేక్షించేది లేదన్నారు. లైసెన్సు లేని, నాటు తుపాకులు ఎవరి వద్ద ఉన్నా వెంటనే దగ్గరలోని పోలీస్ స్టేషనుకు అందజేయాలని పేర్కొన్నారు. కార్డన్ అండ్ సెర్చ్‌లో ఈ అంశానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించామన్నారు.

నూతన వరి వంగడాలు సాగుచేసుకోవాలి

ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్

కోరుకొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రైతు కమతాల్లో ప్రదర్శన నిమిత్తం వేసిన నూతన వరి రకాల ఎదుగుదల, ఆశాజనకంగా ఉందని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు తెలిపారు. కోరుకొండ మండలంలో కోటికేశవరంలో గురువారం పరిశీలించి మాట్లాడారు. సార్వాలో పరిశోధన నిమిత్తం, రైతు కమతాల్లో వేసిన ఎంటీయూ 1443, బీపీటీ 3284, రాగోలు రకాలైన ఆర్‌జీఎల్ 7030,7034, 7038,7039, 7045 వంటి నూతన రకాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయన్నారు. సార్వాలో సాగు చేస్తున్న ఎంటీయూ 1443 ఇటీవల నాట్లు వేశారని.. చీడపీడలు లేకుండా ఆరోగ్యంగా ఉందన్నారు. సక్రమ యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ క్షేత్ర ప్రదర్శనలో మండల వ్యవసాయ అధికారి రఘుకుమార్, వీఏఏ కోన సత్యప్రసాద్, అభ్యుదయ రైతులు ముంద్రు వీరభద్రరావు, విస్సా చంద్ర శేఖర్, తాడపాక బాబూరావు పాల్గొన్నారు.


పిఠాపురం పాదగయ క్షేత్రం

ఇక ఆలయాలకు.. ట్రస్టు బోర్డులు

పిఠాపురం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత నామినేషన్ల పదవుల భర్తీ కొనసాగుతోంది. ఎప్పటినుంచే ఎదురుచూస్తున్న ప్రముఖ ఆలయాలకు ట్రస్టుబోర్డుల నియామకం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం గురువారం నోటిఫికేషన్ల జారీకి జీవో విడుదల చేసింది. ఆయా ఆలయాలకు నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి 20 రోజుల్లోగా వీటికోసం ఆశావాహులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

రెండునెలల కసరత్తు తర్వాత..

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్పొరేషన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, సొసైటీలకు పాలక వర్గాలు నియమించినా ఆలయాలకు ట్రస్టుబోర్డుల నియమాకం కోసం నియోజకవర్గాల్లో కూటమి పార్టీల నాయకులు ఎదురుచూపులు చూడాల్సి వచ్చింది. ఇప్పటికే చిన్న ఆలయాల ట్రస్టుబోర్డులు నియమించేందుకు ఎక్కడికక్కడ నోటిఫికేషన్లు జారీ చేసి దరఖాస్తులు స్వీకరించి విచారణ పక్రియ పూర్తి చేసినా ఇప్పటివరకూ ధర్మకర్తల మండళ్లను ఏర్పాటు చేస్తూ తుది ఉత్తర్వులు విడుదల కాలేదు. రూ.కోటి నుంచి రూ.5కోట్లు వరకూ ఆదాయం ఉన్న ప్రముఖ ఆలయాలకు ట్రస్టుబోర్డుల ఏర్పాటుపై రెండు నెలల కసరత్తు అనంతరం దరఖాస్తుల స్వీకరణకు నోటిఫికేషన్ విడుదల చేస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

20రోజులు గడువు

ట్రస్టుబోర్డుల ఏర్పాటు నిమిత్తం రాష్ట్రప్రభుత్వం గురువారం జీవో జారీ చేయగా 20 రోజుల్లోగా ఆయా ఆలయాల ధర్మకర్తల మండలి సభ్య పదవులు(ట్రస్టీలు) కోసం ఆశావాహులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందు నిమిత్తం దరఖాస్తు ఫారం ప్రొఫార్మాను జీవోకు జత చేశారు. ఈ దరఖాస్తులను ఆయా ఆలయ ఈవోలకు అందజేయాల్సి ఉంటుంది. వీటిపై విచారణ తర్వాత ట్రస్టుబోర్డులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తుంది. ట్రస్టీల ప్రమాణస్వీకారం అనంతరం ఆయా ఆలయాల ధర్మకర్తల మండలి చైర్మన్లను ఎన్నుకోనున్నారు. జీవో జారీ కావడంతో ఆశావహుల్లో సందడి మొదలైంది. ఆలయాలు ఉన్న నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య ఇప్పటికే పదవుల పంపకంపై చర్చలు కొలిక్కి వచ్చాయి. ఆయా పార్టీలకు కేటాయించిన పదవుల ఆధారంగా దరఖాస్తు చేసుకోనున్నారు.

అన్నవరం కోసం ఎదురుచూపులే

రాష్ట్రవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానానికి మాత్రం ఇప్పటివరకూ ట్రస్టుబోర్డు ఏర్పాటు కాలేదు. ఇక్కడ వంశపారంపర్య చైర్మన్ ఉండడంతో ట్రస్టుబోర్డుల సభ్యుల నియామకానికే నోటిఫికేషన్ జారీ కావాల్సి ఉంది. ఈ పదవుల కోసం కాకినాడ జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా పలువురు పోటీపడుతూ ఉంటారు. ఇప్పటికే పదవుల కేటయింపుపై కూటమి పార్టీల మధ్య రాష్ట్ర స్థాయిలో చర్చలు జరిగాయి.

చిన్నఆలయాలకు, సత్రాలకు కూడా..

కాకినాడ జిల్లాలోని మరో 8ఆలయాలు, దేవదాయశాఖ అధీనంలోని సత్రాలకు ధర్మకర్తల మండళ్ల ఏర్పాటు నిమిత్తం ఏపీ ధార్మిక పరిషత్ సభ్య కార్యదర్శి హోదాలో దేవదాయశాఖ కమిషనరు కె.రామచంద్రమోహన్ గురువారం రాత్రి నోటిఫికేషన్ జారీ చేశారు. పిఠాపురంలోని శ్రీసంస్థానసత్రం, కాకినాడ రూరల్ మండలం సర్పవరంలోని భవన్నారాయణస్వామిఆలయం,

» దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ
» ఉమ్మడి జిల్లాలో 16 దేవాలయాలకు ధర్మకర్తల మండళ్లు

పెద్దాపురంలోని ఆర్వీబీఎస్ సత్రం, మండలంలోని కాండ్రకోటలోని నూకాలమ్మ దేవస్థానం, జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలోని పీఎల్వీ సత్రం, కాకినాడలోని కోకనాడ అన్నదాన సమాజం, బంగారు చినశోభనాద్రి సత్రం, మంత్రి పగ్రడ వారి సత్రాలకు ధర్మకర్తల మండళ్ల ఏర్పాటు కానున్నాయి.

ఆలయాలు ఇవే

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 16 ఆలయాల ట్రస్టు బోర్డుల ఏర్పాటుకు జీవో జారీ కాగా ఇందులో కాకినాడ జిల్లాకు సంబంధించి ఏడు, కోనసీమ ఆరు, తూర్పుగోదావరి జిల్లాలోని మూడు ఆలయాలున్నాయి.

● కాకినాడ జిల్లాకు సంబంధించి పిఠాపురంలోని పాదగయక్షేత్రంలోని కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం, శ్రీపాదులవారి జన్మస్థానంగా ప్రసిద్ధిగాంచిన శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం, పంచారామక్షేత్రాల్లో ఒకటిగా ఉన్న సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి దేవస్థానం, చదలవాడ తిరుపతిలోని శృంగార వల్లభస్వామి ఆలయం, పెద్దాపురం మరిడమ్మ దేవస్థానం, తుని తలుపులమ్మలోవ, కాకినాడ ఎంఎస్ఎన్ చార్టీస్‌లకు ట్రస్టుబోర్డులు ఏర్పాటు కానున్నాయి.

● కోనసీమ జిల్లాలోని వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం, అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయం, అప్పనపల్లి బాలబాలాజీ ఆలయం, అమలాపురం వెంకటేశ్వరస్వామి ఆలయం, మురముళ్లలోని వీరేశ్వరస్వామి దేవస్థానం, మందపల్లి మందేశ్వరస్వామి ఆలయాలకు ట్రస్టుబోర్డులు ఏర్పాటు చేస్తారు.

● తూర్పుగోదావరిజిల్లాలోని రాజమహేంద్రవరంలోని పీఎంకే చౌల్ట్రీ, నాళంవారి సత్రం, నిడదవోలు కోట సత్తెమ్మవారి ఆలయానికి ట్రస్టుబోర్డులు ఏర్పాటు కానున్నాయి.

వాడపల్లి వెంకన్న ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ జారీ



ఆత్రేయపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియమాకానికి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రేడ్-1 స్థాయిలో ఉన్న ఈ ఆలయం డీసీ హోదాకు చేరుకుంది. వార్షిక ఆదాయం రూ.30 కోట్లనుంచి రూ.35కోట్లుపైనే ఉంటుంది. డిప్యూటీ కమిషనరు హోదా కలిగిన ఈ ఆలయానికి కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వి.వినయ్‌చంద్ గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. 17మంది ధర్మకర్తలను నియమించాల్సి ఉంది. మరో అర్చక ఎక్స్‌ఆఫీసియో నియమించనున్నారు. 17మందిలో ఏడుగురు మహిళలకు ధర్మకర్తల మండలిలో చోటు కల్పించాల్సి ఉంది. అందులో నాయీబ్రాహ్మణ, బ్రాహ్మణ కులాలకు చెందిన వ్యక్తులకు విధిగా చోటు కల్పించాలి. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలకు ట్రస్టు బోర్డు నియామకం చేపట్టనున్నారు. దేవదాయ కమిషనరు రామచంద్రమోహన్ నుంచి రావాల్సిన ఉత్తర్వుల మేరకు నోటిఫికేషన్ విడుదల చేసి ధర్మకర్తల మండలి నియామకం కోసం ఉత్తర్వులు అందజేయనున్నారు. 20రోజుల్లోగా

» 17మంది ధర్మకర్తల నియామకం కోసం దరఖాస్తుల స్వీకరణ

అర్హులైన దరఖాస్తులు పరిశీలించి కమిషనర్ కార్యాలయానికి పంపించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించిన వ్యక్తులకు ధర్మకర్తల మండలిలో స్థానం లభించనుంది. జిల్లావ్యాప్తంగా ధర్మకర్తల మండలిలో చోటు కోసం కూటమి పార్టీల నేతలు ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు. స్థానిక నేత, క్షత్రియ వర్గానికి చెందిన నేతకు చైర్మన్ గిరి దక్కనుంది.

స్కానర్ ఉందిగా..


కాకినాడలో స్కానర్‌లో డిజిటల్ పేమెంట్ చేస్తున్న యువకుడు

» క్యూఆర్ కోడ్‌తో డిజిటల్ పేమెంట్లు
» చిన్న దుకాణాల్లోను పెరిగిన నగదు రహిత లావాదేవీలు
» ప్రజల్లో పెరిగిన అవగాహన

టీ తాగినా.. టిఫిన్ తిన్నా.. టూత్‌పేస్ట్ కొన్నా.. టీపొడి కొన్నా.. షాపింగ్ మాల్‌కి వెళ్లినా.. చిన్న బడ్డీ కొట్టైనా.. ఎక్కడికి వెళ్లినా ఈ మధ్య కాలంలో వినిపించే పదం.. స్కానర్ ఉందా..? స్కాన్ చేసేయన్నా.. ఒకప్పుడు నగదు లావాదేవీలు మాత్రమే జరిగేవి. కానీ కేంద్ర ప్రభుత్వ చొరవతో డిజిటల్ పేమెంట్స్ పెరిగాయి.

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పట్టణాల్లోనే కాక గ్రామాల్లోను డిజిటల్ పేమెంట్లు పెరిగాయి. ఆరేళ్లక్రితం పెద్దనోట్లను రద్దు చేసిన కేంద్రం ప్రభుత్వం ఆర్థిక సంస్కరణల్లో భాగంగా నగదు రహిత లావాదేవీల మీద దృష్టి సారించింది. దీంతో బ్యాంకర్లు గ్రామస్థాయి నుంచి క్షేత్రస్థాయిలో నగదు రహిత లావాదేవీల మీద ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రారంభదశలో ప్రజలు లావాదేవీలు చేసుకునేందుకు ఇబ్బందులు పడినప్పటికీ ప్రస్తుతం పూర్తిస్థాయిలో నగదు రహిత లావాదేవీలకు అలవాటుపడ్డారు. దుకాణానికి వెళ్లినా, పెట్రోల్‌బంక్‌కు వెళ్లినా క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉండడంతో వినియోగదారుల చేతిలో డబ్బులు లేకపోయినా స్మార్ట్ ఫోన్‌తో ఆర్థిక లావాదేవీలు జరుపుతున్నారు.

క్యూఆర్ కోడ్‌తో..

ఒకప్పుడు అందరూ ఎక్కడికి వెళ్లిన సరిపడా డబ్బులు తీసుకెళ్లేవారు. ఆర్టీసీ, రైల్వే ప్రయాణంలో చిల్లర సమస్య మరీ ఎక్కువగా ఉండేది. ఇంకా అవసరమైతే బ్యాంక్, ఏటీఎం సెంటర్‌లో నగదువిత్ డ్రా చేసుకుని వినియోగించుకునేవారు. ప్రస్తుతం ఆపరిస్థితి కనిపించడంలేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా స్మార్ట్ ఫోన్లు, నగదు బదిలీల కోసం మొబైల్ యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. నగదురహిత లావాదేవీల కోసం క్యూఆర్ కోడ్ మార్కెట్లో దర్శనమిస్తున్నాయి. దీంతో చిన్నపాటి తోపుడు బండ్లవద్ద నుంచి పెద్ద వ్యాపారస్తులు, కార్పొరేట్ ఆస్పత్రులు, ఆర్టీసీ బస్సుల్లో, రైల్వేస్టేషన్‌ల్లో ఈ క్యూఆర్ కోడ్‌లు అందుబాటులో ఉండడంతో రోజుకు ఒక్కరూపాయి మొదలు లక్షల వరకు యాప్‌ల ద్వారా నగదు రహిత ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నారు.

వివిధ యాప్‌లు..

ఆన్‌లైన్ ద్వారా నగదు రహిత లావాదేవీలు చేసేందుకు స్మార్ట్ ఫోన్‌ల్లో వివిధ రకాల యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, డిజిటల్ రూపే, అమెజాన్‌పే, వాట్సప్‌పే లాంటి యాప్‌లతోపాటు బిల్ డెస్క్ వంటివాటలోను డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయి. యాప్ కంపెనీ నిర్వాహకులు, వ్యాపారుల సౌకర్యార్థం దుకాణదారులకు సౌండ్ బాక్సులు కూడా ఇస్తున్నారు. రోజువారీ లావాదేవీలను బట్టి రుణాలు కూడా మంజూరు చేస్తుండడంతో వ్యాపారులు క్యూఆర్ కోడ్‌ల మీద ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో వ్యాపారులకు చిల్లర గొడవ తప్పింది.

చిల్లర ఇబ్బందులు తప్పాయి

-వారణాసి శ్రీనివాసరావు, కాకినాడ



గతంలో కిరాణాదుకాణానికి పెద్దనోటు తీసుకు వెళ్తే చిల్లరకోసం చాలా ఇబ్బందులు పడేవాళ్లం. అవసరం లేకపోయినా వేరే సరుకులను కొనుగోలు చేయాల్సి వచ్చేది. స్మార్ట్ ఫోన్ల ద్వారా చెల్లింపులతో చిల్లర కష్టాలు తగ్గాయి.

అవగాహన కల్పిస్తున్నాం

-రాజాబాబు, కిరాణాషాపు యజమాని



షాపులకు వచ్చేవారందరూ ఏది కొన్నా స్మార్ట్ ఫోన్ల ద్వారా చెల్లిస్తున్నారు. డిజిటల్ పేమెంట్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మాకు చిల్లర కష్టాలు తగ్గాయి. క్యూఆర్ కోడ్ గురించి తెలియని వారికి తెలియజేస్తున్నాం.


జ్యోతిప్రజ్వలన చేసి గిరిజన దినోత్సవాన్ని ప్రారంభించిన ఉప కులపతి ప్రసన్నశ్రీ

గిరిజన సంస్కృతిని సాంకేతికతతో పరిరక్షించుకుందాం

అంతర్జాతీయ గిరిజన దినోత్సవంలో 'నన్నయ' ఉప కులపతి ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మౌఖిక రూపంలో ఉండే అపారమైన గిరిజన సాహిత్య, సంస్కృతి సంపదను సాంకేతిక పరిజ్ఞానంతో పరిరక్షించి భావితరాలకు అందించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ పిలుపునిచ్చారు. నన్నయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం సహకారంతో ఎస్సీ, ఎస్టీ సెల్, విశ్వవిద్యాలయం సైన్స్-టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ గిరిజన దినోత్సవం-2025ను గురువారంనిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ స్థానిక ప్రజలు, కృత్రిమ మేథస్సు-హక్కులను కాపాడుకోవడం, భవిష్యత్తును రూపొందించడం అనే అంశంతో ప్రపంచ గిరిజన దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లోని భాష, సంస్కృతి, సాహిత్యం ఎంతో ప్రత్యేకమైనవని తెలిపారు. చిన్న, చిన్న గూడేల్లో స్వచ్ఛమైన గిరిజన సాహిత్యం తారసపడుతుందన్నారు. గిరిజనులు వాడుక భాషతో మౌఖికంగా సాహిత్య సేద్యం చేస్తున్నారన్నారు. ప్రకృతితో బంధం ఏర్పరచుకుని రాయిలో కూడా దేవుని చూడగలిగే మంచి మనసున్న వారే గిరిజన పుత్రులు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన ప్రాంతాల్లో రహదారులు వేయడం అభినందనీయమన్నారు. పాఠశాలలు, ఆసుపత్రులే అసలైన దేవాలయాలని చెప్పారు. ఐక్యరాజ్యసమితి ప్రకారం అంతరించిపోతున్న భాషలు మౌఖిక చరిత్రలనుసంరక్షించడానికి, పూర్వీకుల భూములను మ్యాప్ చేయడం వంటివాటికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడుతుందన్నారు. ఆంధ్ర గిరిజన వర్గాలు భావితరాలకు సజీవవారసత్వ సంపద అని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి మాట్లాడుతూ నేటి ఆధునిక మానవుల ఆదిమ జీవితం ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లోనే ఆరంభమైందన్నారు. గిరిజన ప్రాంతాల్లోని వివిధ రకాల సంస్కృతి, సంప్రదాయాలను ప్రస్తావించారు. భారత స్వాతంత్రోద్యమంలో గిరిజనవీరుల కృషి చిరస్మరణీయమన్నారు. గిరిజన సంస్కృతిని ప్రతిబింబిస్తూ కూచిపూడి డిప్లొమా విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. విశ్వవిద్యాలయ అధికారులు వారితో కలిసి నృత్యం చేశారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, సదస్సు కన్వీనర్ పి.విజయనిర్మల, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శన


కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ జట్ల మధ్య హోరాహోరీగా సాగుతున్న మ్యాచ్


తలపడుతున్న ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర జట్ల క్రీడాకారులు

రెండు డ్రా రెండు వన్‌సైడ్

జాతీయ మహిళా జూనియర్ హాకీ పోటీల్లో ముగిసిన లీగ్ మ్యాచ్‌లు

రేపటి నుంచి క్వార్టర్ ఫైనల్స్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): హాకీ ఇండియా 15వ జూనియర్ మహిళా జాతీయ చాంపియన్‌షిప్-2025లో భాగంగా కాకినాడ జిల్లా క్రీడా మైదానంలోని ఆస్ట్రోటర్ఫ్ ఫీల్డ్‌లో గురువారం నాలుగు మ్యాచ్‌లు జరిగాయి. రెండు మ్యాచ్‌లు డ్రాగా ముగియగా, మరో రెండు మ్యాచ్‌లు వన్‌సైడ్ అయ్యాయి. ముఖ్య అతిథిగా మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ ఎం.సుభాకరరావు హాజరయ్యారు. రాష్ట్ర హాకీ సంఘ కార్యదర్శి హర్షవర్ధన్, సంయుక్త కార్యదర్శి వి.రవిరాజు, కోశాధికారి పి.థామస్‌పీటర్, భవానీ శంకర్ ముఖ్య అతిథులుగా హాజరై మ్యాచ్‌లను వీక్షించారు.

పంజాబ్-చండీఘర్ మధ్య జరిగిన మ్యాచ్ 1-1తో డ్రాగా ముగిసింది. బెంగాల్-ఉత్తరప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్ 1-1తో డ్రా అయ్యింది. కర్ణాటక-ఛత్తీస్‌గఢ్ మధ్య జరిగిన మ్యాచ్ 6-1తో ఛత్తీస్‌గఢ్ విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్-మహారాష్ట్ర మధ్య జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర 5-1తో విజయం సాధించింది.

మొత్తం 29 రాష్ట్రాల నుంచి జట్లు పాల్గొనగా గురువారంతో లీగ్ మ్యాచ్‌లు ముగిశాయి. క్రీడాకారులకు శుక్రవారం విశ్రాంతి ఇచ్చారు. చివరికి మిగిలిన ఎనిమిది జట్లు శనివారం జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో తలపడనున్నాయి.

క్వార్టర్ ఫైనల్ 1.హర్యానా వర్సెస్ ఒడిసా, 2.మధ్యప్రదేశ్ వర్సెస్ ఛత్తీస్‌గఢ్, 3.జార్ఖండ్ వర్సెస్ పంజాబ్, 4.మహారాష్ట్ర వర్సెస్ ఉత్తరప్రదేశ్

10న సెమీ ఫైనల్స్, 12న ఫైనల్స్

క్వార్టర్ ఫైనల్స్ ఆడిన 8 జట్లలో మిగిలిన నాలుగు జట్లు 10న సెమీ ఫైనల్స్ ఆడనున్నాయి. 11న విశ్రాంతి దినం. మూడో స్థానం కోసం 12వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు లూజర్ సెమీఫైనల్ మ్యాచ్ జరగనుంది. మిగిలిన రెండు జట్లు సాయంత్రం 3 గంటలకు ఫైనల్ మ్యాచ్‌లో తలపడతాయని డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్, రాష్ట్ర హాకీ సంఘ సంయుక్త కార్యదర్శి వి.రవిరాజు చెప్పారు.



డబ్బులు లేవంటూనే లక్షల ఎకరాల భూసేకరణ

» మోదీ, చంద్రబాబు దొందూ దొందే
» సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ


రాజమహేంద్రవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి భూసేకరణ ప్రధాన అజెండాగా మారిపోయిందని, డబ్బులు లేవంటూనే లక్షల ఎకరాల భూసేకరణ చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ వ్యాఖ్యానించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాలులో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే భూమిలేని పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్ల భూమి ఇస్తామని చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా ఆ ఊసే ఎత్తట్లేదన్నారు. ఇళ్ల స్థలాల కోసం సీపీఐ కార్యకర్తలు కొన్ని ప్రాంతాల్లో పేదలతో దరఖాస్తులు చేయిస్తుంటే అధికార పార్టీ వారే చేయాలని అడ్డుకుని వారికి నచ్చినవారితోనే దరఖాస్తు చేయించే పరిస్థితి వుందన్నారు. మరోపక్క రాష్ట్రంలో ప్రాంతీయ వైషమ్యాలు రెచ్చగొట్టడానికి ఉత్తరాంధ్రలో పరిశ్రమలు పెడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో దళితులు, మైనార్టీలు, మహిళలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవట్లేదన్నారు. దళితులను హింసిస్తే సాక్షాత్తు మంత్రే సమర్థించడం రాష్ట్రంలో దళిత వ్యతిరేక పాలనకు నిదర్శనమన్నారు. కస్టడీలో ఉన్న వారిని కొట్టే హక్కు పోలీసులకు లేదన్నారు. దేశంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు దొందూ దొందే అని విమర్శించారు. సతానత ధర్మాన్ని కాపాడాలని చిలకపలుకులు పలికిన మోదీ ఇప్పుడు మిజోరం ఎన్నికల్లో తమను గెలిపిస్తే బీఫ్‌ను ఆహారంగా ప్రకటిస్తామని చెప్తున్నారన్నారు. రాష్ట్రంలో ఇచ్చిన హామీలను చంద్రబాబు నెరవేర్చలేదన్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్రంలోని పరిస్థితులపై చర్చించి ప్రజా పోరాటాలపై కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

జాతీయ కార్యవర్గ సభ్యురాలు వనజ అక్కినేని మాట్లాడుతూ రాష్ట్ర మహాసభల అనంతరం రాష్ట్రంలో మరో విద్యుత్ ఉద్యమం చేపడతామన్నారు. జగన్ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన చంద్రబాబు మీటర్లు బిగిస్తే బద్దలుకొడతామన్నారన్నారు. ఇప్పుడు అదే స్మార్ట్ మీటర్లను బిగించాలని ప్రయత్నిస్తున్నారని, అదానీ మీటర్లను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును జగన్ ప్రభుత్వం తగ్గించిందని ఆందోళన చేసిన చంద్రబాబు ఇప్పుడే అదే ఎత్తును ఎందుకు అంగీకరించారని ప్రశ్నించారు. పైగా అదే కాంట్రాక్టరుకే మళ్లీ ప్రాజెక్టును ఎలా అప్పగించారని నిలదీశారు. రాష్ట్రంలో ఎన్నో ప్రాజెక్టులు ఉండగా... వాటిని పూర్తి చేయకుండా కొత్తగా బనకచర్ల ప్రాజెక్టును తెరమీదకు తేవడం చూస్తే ఈ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులు, కాంట్రాక్టర్ల కోసం పని చేస్తున్నట్టు ఉందని ధ్వజమెత్తారు. చంద్రబాబు సపోర్టుతో కేంద్రంలో ప్రభుత్వం ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రయోజనాలను కూటమి ప్రభుత్వం కాపాడలేకపోతుందని మండిపడ్డారు.

విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, రేఖా భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి స్నానానికి వెళ్లి వస్తూ...

రోడ్డు ప్రమాదం

● కుమార్తె మృతి, కుమారుడి పరిస్థితి విషమం

● తీవ్రంగా గాయపడిన తల్లిదండ్రులు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి వెంకటదుర్గ



గాయాలపాలైన పండూరు రాంబాబు, వీరలక్ష్మి దంపతులు

గోకవరం, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో గోదావరి స్నానానికి వెళ్లి వస్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమార్తె మృతి చెందగా, కుమారుడి పరిస్థితి విషమంగా ఉండగా, తల్లిదండ్రులు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని బావాజీపేట గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం... తూర్పుగోదావరిజిల్లా గోకవరం మండలం కామరాజుపేట గ్రామానికి చెందిన పండూరు రాంబాబు, వీరలక్ష్మి దంపతులతోపాటు వారి కుమార్తె వెంకట దుర్గ(7), కుమారుడు పూర్ణకిరణ్‌లు వరలక్ష్మి పూజ సందర్భంగా మోటారు సైకిల్‌పై గోదావరిస్నానం చేసేందుకు గురువారం ఉదయం రాజమహేంద్రవరం వెళ్లారు. అక్కడ స్నానమాచరించిన అనంతరం తిరిగి స్వగ్రామం బయలు దేరి వస్తుండగా మండలంలోని బావాజీపేట -వీరలింకపల్లి గ్రామాల మధ్య వీరు ప్రయాణిస్తున్న మోటారుసైకిల్‌ను ఎదురుగా వస్తున్న గ్యాస్ ట్యాంకర్ ఢీకొంది. దీంతో రాంబాబుతోపాటు భార్య, కుమార్తె, కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను గోకవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుమార్తె వెంకటదుర్గ, కుమారుడు పూర్ణకిరణ్ పరస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం వారిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ వెంక టదుర్గ మృతి చెందింది. పూర్ణకిరణ్ పరిస్థితి కూడా విషమంగా ఉండటంతో అక్కడి నుంచి కాకినాడ ప్రభు త్వాసుపత్రికి తరలించారు. బాధితుడు రాంబాబు ఇటుక బట్టీలో కూలి పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుం టున్నాడు. జరిగిన సంఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆశ తీరినా..ఊపిరిలేదు!

● నాలుగో కాన్పులో మగ పిల్లాడు.. ఆ తల్లి ఆశ తీరినా ప్రాణం నిలవలేదు

● 20 రోజులు ముందుగానే ఆసుపత్రిలో చేర్చినా ఫలితం దక్కలేదు

● రాజమహేంద్రవరం ఆసుపత్రికి చేరేసరికే గర్భిణీ, శిశువు మృతి

● ముగ్గురు పిల్లలను అనాథలను చేసి వెళ్లిపోయిన తల్లి

● ఘటనపై విచారణకు ఆదేశించామన్న ఐటీడీఏ పీవో



ముగ్గురు ఆడబిడ్డలు, మృత శిశువుతో పండా సింధూర మృతదేహం

రంపచోడవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఏరియా ఆసుపత్రి నిర్లక్ష్యానికి ముగ్గురు ఆడబిడ్డల తల్లి తన నాల్గవ కాన్పులో ప్రసవ సమయంలో ప్రాణాలు కోల్పో గా, ఆమె గర్భంలో ఉన్న శిశువు కూడా మరణించింది. అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం దామనపల్లికి చెందిన ముగ్గురు ఆడబిడ్డల తల్లి పండా సింధూరం(29)నాల్గవ కాన్పుకోసం జూలై 18న రంపచోడవరం ఏరియా ఆసుపత్రి లో చేరితే 20 రోజుల పర్యవేక్షణ అనంతరం బుధవారం ఆమెకు సహజప్రసవం చేయాలని ప్రయత్నించి విఫలమైన ఆసుపత్రి వైద్యులు పరిస్థితి చేయి దాటిపోయాక మాత్రం హుటాహుటిని రాత్రి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా అక్కడికి చేరుకున్నాక తక్షణం సిజే రియన్ చేయాలని వైద్యులు నిర్ణయించారు. ఆమె మరణించడంతో గర్భంలో ఉన్న బిడ్డ కోసం సిజేరియన్‌చేసి చూస్తే ఆమె కడుపున ఉన్న మగబిడ్డ కూడా మరణించింది. పండా సింధూరం తన భర్తతో రాజమహేంద్రవరంలో జీవిస్తోంది.

ఆమె ఇప్పటికే ముగ్గురు ఆడపి ల్లలకు సహజ ప్రసవంలో జన్మనిచ్చింది. నాల్గవ కాన్పులోనైనా దేవుడు తమకు మగబిడ్డను ప్రసాదిస్తాడని ఆ దంపతులు ఆశించారు. ఆశించినట్టుగానే ఆమె కడుపున మగబిడ్డ రూపుదిద్దుకుంది. తన పుట్టింటి వద్ద బంధువులు, అంగన్‌వాడీ, స్థానిక వైద్య-ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణ, ఎప్పటికప్పుడు వైద్యుల పర్యవేక్షణలో దామనపల్లిలోనే ఏంతో ఆశగా జీవించింది. వైద్యుల సూచనలతో ఆగస్టు మొదటివారంలో ప్రసవం జరగవచ్చునని గుర్తించి వారి సూచనతోనే ఈమెను జూలై 18న రంపచోడవరం ఆసుపత్రిలో చేర్చి వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. కాగా బుధవారం ఆమెకు ప్రసవం వచ్చే అవకా శాన్ని గుర్తించిన వైద్యులు ప్రసవానికి ఏర్పాట్లు చేసుకున్నారు. అందుకు తగ్గట్టుగానే ప్రసవ గదిలో ఆమెకు ప్రసవాన్ని కల్పించే చర్యలను చేపట్టారు. ఆమె ప్రసవం ప్రమాదభరితంగా మారిందని చివరిక్షణంలో బుధవారంరాత్రి రాజ మహేంద్రవరం ఆసుపత్రికి ఆమెను తరలించా రు. కానీ అక్కడకు చేరుకునే సరికే పరిస్థితి చేజారిపోయింది. హుటాహుటిన సిజేరియన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడటం, ఆ పరిస్థితు ల్లోనే సదరు మహిళ మృతి చెందడం, కడుపులో ఉన్న బిడ్డకోసం సిజేరియన్ చేసినా కడుపులో ఉన్న మగబిడ్డ మృతి చెందడం జరిగిపోయాయి. ఈ ఆసుపత్రిలో ఇటీవల ఇటువంటి నిర్లక్ష్య ఘటనలు పలు చోటుచేసుకున్నాయి. గత నెల లోనే వై.రామవరం మండలం జాజిగడ్డకు చెందిన కాకూరి పార్వతి ప్రసవం కోసం వచ్చి మృతి చెందగా, బిడ్డ ప్రాణాలతో మిగిలింది. రంపచోడవరానికి చెందిన మరో గిరిజన మహిళను కూడా ప్రసవం కోసం ప్రయత్నంచేసి విఫల మై ప్రసవం మధ్యలోనే రాజమండ్రికి తరలించ గా మార్గమధ్యంలోనే అంబులెన్సులో ఆమె ప్రసవించింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా అనేక సౌకర్యాలను కల్పిస్తే కేవలం నిర్లక్ష్యం కారణంగా గర్భిణులకు సుఖ ప్రసవాన్ని కల్పిం చడంలో మాత్రం ఈ ఆసుపత్రి విఫలమైంది. ఈ ఆసుపత్రిపై నిరంతర పర్యవే క్షణ ఉంచాల్సిన ఐటీడీఏ, ఇతర ఉన్నతాధికారులు సైతం ఏమీ పట్టనట్టు వ్యవహరించడంతోనే ఈ పరిస్థితులు ఏర్ప డుతున్నాయి. ఈతాజా ఘటనపై మాత్రం ఐటీడీఏ ప్రాజెక్టు అధికా రి కట్టా సింహాచలం స్పందించి విచారణకు ఆదేశించారు. అల్లూరి, రాజమండ్రి జిల్లాల ఆరో గ్య సేవల కో-ఆర్డినేటర్లు విచారణ జరుపుతు న్నారని, నివేదికలనుబట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

షాపులోకి దూసుకెళ్లిన కోళ్ల వ్యాన్

● టీ షాపు నిర్వాహకుడి మృతి

● తెల్లావారుజామున కావడంతో తప్పిన పెను ప్రమాదం




వాసంశెట్టి త్రిమూర్తులు (ఫైల్)

పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్‌లో షాపుల్లోకి దూసుకుపోయిన కోళ్ల లారీ, అంత్యక్రియల్లో భాగంగా పాడెమోసిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్‌లో గురువారం తెల్లావారుజామున కోళ్ల వ్యాన్ షాపుల్లోకి దూసుకుపోయిన ఘటనలో టీ షాపు నిర్వాహకుడు మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...పి.గన్నవరం గ్రామానికి చెందిన వాసంశెట్టి త్రిమూర్తులు(56) గత కొంతకాలంగా పి.గన్నవరం సెంటర్‌లో టీకొట్టు నిర్వహించుకుంటున్నాడు. ఈ క్రమంలో తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో టీ షాపును తెరిచేందుకు చేరుకున్న త్రిమూర్తులుషాపు ఎదురుగా శుభ్రం చేస్తుండగా గంటివైపు నుంచి కోళ్ల లోడుతో వస్తున్న వ్యాన్ వేగంగావచ్చి షాపుల్లోకి దూసుకుపోయింది. దీంతో త్రిమూర్తులుకు తీవ్రగాయం కావడంతో చికిత్స నిమిత్తం అమలాపురం తీసుకు వెళ్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. త్రిమూర్తులుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అప్పడే ఇంటి నుంచి షాపుకు వచ్చారని ఇంతలోనే ఘోరం జరిగిపోయిందని కుటుంబ సభ్యులు రోధిస్తున్న తీరు స్థానికులను కన్నీరు పెట్టిస్తోంది. అమలాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టమార్టం నిర్వహించామని మృతుడు బంధువులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. జ్యూస్ షాపుతోపాటు టీషాపు, చెరకు రసం షాపుల ముందు భాగంలో ఉండే షెడ్లు నుజ్జు నుజ్జు అయ్యాయి. త్రిమూర్తులు అకాల మరణానికి సంతాపంగా స్థానిక వర్తక సంఘం సభ్యులు మధ్యాహ్నం వరకు షాపులు బంద్‌చేసి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పి.గన్నవరంలో జరిగిన అంత్యక్రియల్లో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ త్రిమూర్తులు మృతదేహానికి నివాళులర్పించిన అనంతరం ఆయన స్వయంగా పాడెమోసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈయాత్రలో కూటమి నాయకులు కుమార్ పాల్గొన్నారు.

చామంతి ఏమిటే.. ఈ వింత!



చామంతి కిలో రూ.550 - శ్రావణం ఎఫెక్ట్

కడియం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కడియపులంక అంతర్‌రాష్ట్ర పూలమార్కెట్ నుంచి రాష్ట్రం నలుమూలలకు పూలు ఎగుమతి అవుతాయి. చామంతి, బంతి పూలు మాత్రం డిసెంబర్‌లో ప్రారంభమై మార్చి, ఏప్రిల్‌నెల వరకు ఉంటాయి. క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి వంటి పండుగల వరకు మనప్రాంతంలో పూసిన బంతి, చామంతి పూలు మనకు లభిస్తాయి. మిగిలిన మాసాల్లో బంతి పూలను కర్నాటక రాష్ట్రం నుంచి, చామంతి పూలను తమిళనాడు నుంచి పూలవ్యాపారులు దిగుమతి చేసుకుని విక్రయాలు సాగిస్తుంటారు. ఆయా రాష్ట్రాల నుంచి రోజుకు 5వేల కేజీలు దిగుమతి చేసుకుంటే, శ్రావణమాసం, వివాహాల సమయంలో మాత్రం రోజుకు సుమారు 25నుంచి 30 టన్నుల వరకు పూలు దిగుమతి అవుతుంటాయని పూల వ్యాపారులు చెబుతున్నారు. ఈ ప్రాంతం నుంచి రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు బస్సులు, వాహనాలద్వారా పూలను ఎగుమతి చేస్తుంటారు. మల్లెలు, జాజులు, కాగడాలు, లిల్లీ, కనకంబరం వంటి పూలు మాత్రం ఇక్కడే లభ్యమవుతాయి. వీటి ధరలు మాత్రం మామూలు రోజుల్లో సామాన్యంగా ఉంటే, ముహూర్తాలు, శుభకార్యాలు, పండుగలు, శ్రావణ శుక్రవారం వంటి రోజుల్లో మాత్రం మారుతుంటాయి.

కడియపులంక మార్కెట్‌లో పూల ధరలు

పూలు	గతంలో	ప్రస్తుతం
ఎల్లోచామంతి (కిలో)	రూ.250	రూ.550
వైట్‌చామంతి(కిలో)	రూ.200	రూ.500
నీలం చామంతి (కిలో)	రూ.200	రూ.350
కనకంబరం బారు(1)	రూ. 70	రూ.270
బంతి (కిలో)	రూ. 60	రూ.120
లిల్లీ (కిలో)	రూ.100	రూ.500
మల్లెలు (కిలో	రూ.600	రూ.1,000
కాగడాలు (కిలో	రూ.250	రూ.700
జాజులు (కిలో)	రూ.400	రూ.700



ఆనంద్ రీజెన్సీ సీజ్‌ను అడ్డుకుంటున్న కార్మికులు

ఆనంద్ రీజెన్సీ సీజ్‌కు బ్యాంక్ అధికారుల యత్నం

రాజమహేంద్రవరంసిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరం హోటల్ ఆనంద్ రీజెన్సీని సీజ్ చేయాలని ఏఆర్‌సిఐఎల్ బ్యాంక్ అధికారులు చేసిన ప్రయత్నాన్ని కార్మికులు అడ్డుకున్నారు. గురువారం స్థానిక కంబాలపేట సమీపంలో ఉన్న హోటల్ ఆనంద్‌రీజెన్సీకి బ్యాంక్ అధికారులు సీజ్ చేయడానికి వస్తున్నట్లుగా సమాచారం కార్మికులకు అందడం వారంతా హోటల్ ఎదుట నిరసన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గేటువద్ద బ్యాంక్ అధికారుల వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో సెంట్రల్ జోన్ డిఎస్‌పి రమేష్ బాబు పోలీస్ అధికారులు ఆనంద్‌రీజెన్సీ వద్దకు చేరుకున్నారు. బ్యాంక్ అధికారుల వాహనాన్నిఅడ్డుకోవడంతో ఉద్రిక్త వాతవరణం నెలకొనడంతో పోలీసులు సర్దిచెప్పారు. ఈసందర్భంగా రీజెన్సీ సీఈవో పీవీఆర్ మూర్తి విలేకరులతో మాట్లాడారు. చెన్నైలోని తమ యాజమాన్యం ఆనందరావు డవలపర్స్ పేరున ముంబైలోని ఎఆర్‌సీఐఎల్ బ్యాంక్ నుంచి గతంలో రూ42కోట్లు రుణం తీసుకున్నారని తీర్చలేకపోవడంతో రూ.700కోట్ల ఆస్తిని వారికి హ్యాండోవర్ చేశారని తెలిపారు. అదేవిధంగా రాజమహేంద్రవరంలోని ఆనంద్ రీజెన్సీ హోటల్‌ను గ్యారంటీగా పెట్టారని చెప్పారు. రుణం తీర్చలేకపోవడంతో ఎక్స్‌పార్టీ ఆర్డర్ తీసుకుని ఏపీ హైకోర్టు ద్వారా బ్యాంక్ వాళ్ళు వచ్చారని అయితే హోటల్‌ను సీజ్‌చేసే అధికారి వారికి లేదన్నారు. ఈ రోజు హోటల్‌లో వావాహ వేడుక జరుగుతుందని ఇలాంటి సమయంలో వచ్చి హోటల్ సీజ్ చేయాలనుకోవడం దారుణమన్నారు. ఆనంద్ రీజెన్సీపై ప్రత్యక్షంగా 250మంది కార్మికులు, పరోక్షంగా 400మంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారని హోటల్‌ను సీజ్‌చేసి వారందరిని రోడ్డుపై పడేయాలనుకోవడం అన్యాయమన్నారు. రేపు న్యాయస్థానంలో తీర్పు వెల్లడించనున్నారని అంతవరకు ఆగాలని కోరారు. ఇప్పటికే హోటల్‌లో 30 రూమ్‌లను, కిచెన్‌ను సీజ్ చేసారని చెప్పారు. హోటల్‌ను స్వాధీనం చేసుకోవాలని ఆర్డర్‌వుంది తప్పితే సీజ్ చేయాలని లేదన్నారు.హోటల్ సీజ్ చేస్తేఊరుకోమని కార్మిక నాయకులు హెచ్చరించారు.

ప్రియుడే హంతకుడు..

● తల్లీ, ఇద్దరు కుమార్తెల హత్య కేసులో వీడిన మిస్టరీ..

● వివాహేతర సంబంధంతోనే... లారీ ఓనర్ కమ్ డ్రైవర్ తలే సురేష్‌ను అరెస్టు చేసిన పోలీసులు

● వివరాలు వెల్లడించిన ఎస్పీ

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లా సామర్లకోటలో సంచలనం రేపిన తల్లీకూతుళ్ల హత్య కేసులో నిందితుడు పోలీసులకు చిక్కాడు. హత్యకు వివాహేతర సంబంధమే కారణమని తేల్చారు. ఈనెల రెండో తేదీ రాత్రి సామర్లకోట సీతారామకాలనీలో నివాసం ఉండే ములపర్తి మాధురి (29), ఆమె కుమార్తెలు పుష్పకుమారి(8), జైజీ జెస్సీలోన (6) హత్యకు గురై రక్తపు మడుగులో పడి ఉన్నారు. రాత్రి డ్యూటీకి వెళ్లి ఉదయం ఇంటికి వెళ్లి వచ్చిన భర్త తీవ్రరక్తస్రావంతో విగతజీవుల్లా పడి ఉన్న భార్య, పిల్లలను చూసి కుప్పకూలిపోయాడు. వెంటనే విషయాన్ని కుటుంబసభ్యులకు, పోలీసులకు తెలియజేశాడు. దీనిపై సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సంఘటన జరిగిన రోజు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ సంఘటన స్థలానికి చేరుకుని, హత్యకు గల కారణాలపై ఆరా తీశారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాల ను ఏర్పాటు చేసి గాలించారు. చివరికి మాధురి ప్రియుడే హంతకుడు అని తేల్చారు. ఆ వివరాలను గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మీడియాకు వెల్లడించారు. సామర్లకోటలో సంచలనం రేపిన హత్యకేసులో అదే ప్రాంతంలోని కొత్తపేటకు చెందిన తలే సురేష్ అనే ట్రక్కు ఓనర్ కం డ్రైవర్ ముద్దాయి అని తెలిపారు. ఇతడు రెండేళ్లుగా మాధురితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని, ఆమె కుటుంబ అవసరాలు తీరుస్తూ సహకరించేవాడని పేర్కొన్నారు. ఈ రెండేళ్లలో సురేష్ సుమారు రూ.ఏడు లక్షలను ఆమెతో పాటు, ఆమె కుటుంబసభ్యులకు ఖర్చుచేయడంతో తరచూ మాధురి, సురేష్ మధ్య వివాదాలు రేగడం, తనను తన భర్త నుంచి దూరంగా తీసుకువెళ్లిపోవాలని ఒత్తిడి చేయడం, మరోవైపు ఈ వివాహేతర సంబంధం విషయం సురేష్ భార్యకు తెలిసిపోవడంతో చివరికి మాధురిని అంతం చేయాలని నిర్ణయించుకున్నాడని ఎస్పీ వివరించారు.

మాటామాటా పెరిగి..

రెండో తేదీ రాత్రి పది గంటల తర్వాత మాధురి తన భర్త లేడు రమ్మని సురేష్‌ను పిలవడంతో ఇదే అదనుగా భావించిన సురేష్ మాధురిని హతమార్చేందుకు దుడ్డుకర్రను తన లారీ నుంచి తీసుకుని వెళ్లి ఇంటి గుమ్మం వద్ద వెనుక పెట్టి ఇంట్లోకి ప్రవేశించాడని, కొంతసేపు వీరిద్దరూ మాట్లాడుకున్నారని, అనంతరం ఇరువురి మధ్య బంగారు వస్తువులు, వాషింగ్ మెషీన్ విషయమై మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తుడైన సురేష్ తన వెంట తెచ్చుకున్న దుడ్డు కర్రతో తలపై బలంగా మోదీ చంపినట్టు ఎస్పీ చెప్పారు. ఆ సమయంలో కేకలు విని నిద్ర లేచిన చిన్నారులు పుష్పకుమారి, జైజీజెస్సీలోనలను తలపై బలంగా మోది హతమార్చాడన్నారు. అనంతరం మాధురి ఇంటిలో దాచి ఉంచిన బంగారు నగలు, రెండు సెల్‌ఫోన్లు, దుడ్డుకర్రను పట్టుకుని ఇంటి వెనుకనుంచి బయటకు వచ్చి లారీలో కాకినాడ - యానాం మీదుగా వెళ్లిపోయాడని ఎస్పీ తెలిపారు.

సామర్లకోట సుగర్ ఫ్యాక్టరీ వద్ద...

తనపై పోలీసులకు అనుమానం వచ్చిందనే విషయం తెలుసుకున్న సురేష్ ఈ కేసు విషయమై ఓ న్యాయవాది సలహా తీసుకునేందుకు సామర్లకోట రాగా, అతడిని పోలీసులు సుగర్ ఫ్యాక్టరీ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి లారీ, రూ.రెండున్నర లక్షల విలువ జేసే బంగారు వస్తువులు, అతడి సెల్‌ఫోను, హత్యకు ఉపయోగించిన దుడ్డుకర్రను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. ఈకేసును వేగంగా ఛేదించడంలో సహకరించిన పోలీసు విభాగాలను ఎస్పీ అభినందించారు. పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు, ఎస్‌బీ డీఎస్పీ కేవీవీ సత్యనారాయణ, పెద్దాపురం క్రైం సీఐ ఆర్.అంకబాబు, సామర్లకోట సీఐ కృష్ణభగవాన్, తుని ఎస్సై విజయబాబు, పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం కాదు... పెట్రోల్ పోసి అంటించారు

● యానాం ఏటీఎంలో జరిగిన ప్రమాదాన్ని ఛేదించిన పోలీసులు

● రూ.12 లక్షల మేర చోరీ ● ఇద్దరి అరెస్టు



ఏటీఎం నిందితులతో యానాం పోలీసులు

యానాం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): యానాం బస్టాండ్ వెనుక ఉన్న కంచర్ల కాంప్లెక్స్‌లోని ఏటీఎంలో గతనెల 8వ తేదీన జరిగింది .. అగ్నిప్రమాదం కాదని కావాలనే పెట్రోల్ పోసి అంటించారని యానాం పోలీసులు గుర్తించారు. వారి వివరాల మేరకు గత నెలలో ఎస్‌బీఐ ఏటీఎంలో ఒక్కసారిగా మంటలు చేలరేగడంతో అక్కడే ఉన్న మోకానిక్ షెడ్డుకు సంబంధించిన ఐదు ద్విచక్రవాహనంతో పాటు ఒక కారు పూర్తిగా కాలిపోయిన విషయం తెలిసిందే. యానాం ఇన్‌చార్జి ఎస్పీ, సీఐ ఆదేశాల మేరకు ఎస్‌ఐలు పూనిత్‌రాజ్, కట్టా సుబ్బారాజు క్రైం టీమ్‌తో విచారణ చేపట్టారు. సీసీ ఫుటేజీ ఆధారంగా ఒక వ్యక్తిని గుర్తించడం జరిగింది. ఏటీ ఎంలో క్యాష్ డిపాజిట్ చేసే వ్యక్తులు ఈ సంఘటనకు పాల్పడినట్టు తెలిసింది. ఇందులో కాజులూరు మండలం కుయ్యేరుకు చెందిన వెంకటేష్ (బిట్టు), సరేంద్రపాడుకు చెందిన అనిల్‌బాబును అదుపులోకి తీసుకున్నారు. వీరు ప్రక్క ప్రణాళికతో 10 లీటర్ల పెట్రోలు తీసుకువచ్చి ఏటీఎం వేసి నిప్పు పెట్టినట్టు తెలిసింది. దీనికి ప్రధాన కారాణం గత రెండు సంవత్సరాలుగా ఏటీఎంలలో క్యాష్ డిపాజిట్ చేస్తూ తన సొంత అవసరాల నిమిత్తం పది, ఇరవై, యాభైలు చొప్పున వాడుకోవడం, జీతాలు అందిన తరువాత వాటిని మరలా డిపాజిట్ చేయడం జరుగుతోంది. ఈనేపథ్యంలో సుమారు రూ.12 లక్షల వరకు బకాయి పడ్డారు. దీనిని తిరిగిచెల్లించేందుకు డబ్బులు లేకపోవడంతో పక్కాప్రణాళికతో ఏటీఎంను కాల్చిస్తే మనం డబ్బులు కట్టనవసరం లేదనే ఉద్దేశంతో ఈ సంఘటనకు పాల్పడ్డారు. క్రైంటీమ్ సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గాలించి పట్టుకోవడం జరిగిందన్నారు. వీరిని అదుపులోకి తీసుకొవడంతో పాటు వారి వద్ద నుంచి ఆ డబ్బులతో కొనుగోలు చేసిన కారు, సెల్‌ఫోన్లు, బట్టలను స్వాధీనం చేసుకొని కోర్టుకు తరలించడం జరిగిందని తెలిపారు.

గుర్తేడు కేంద్రంగా...

● అభిప్రాయాల కోసం జిల్లా ఏర్పాటు చట్టం కింద నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం

● ఏడుగురు ఐఏఎస్‌ల కిడ్నాప్‌తో దేశ వ్యాప్తంగా గుర్తేడుకు గుర్తింపు

59 గ్రామాలతో 'అల్లూరి'లో కొత్త మండలం

రంపచోడవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అల్లూరి మన్యంలోని రంపచోడవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో గుర్తేడు కేంద్రంగా 59 గ్రామాలతో కొత్త మండలాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంగా ఉన్న గుర్తేడు 1987లో ఏడుగురు ఐఏఎస్ అధికారులను అప్పటి పీపుల్స్‌వార్ నక్సలైట్లు కిడ్నాప్ చేసిన ఘటనతో దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. తర్వాత ఈ పరిసర ప్రాంతాల అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో అభివృద్ధికి ఆటంకంగా మారింది. దీనికి పరిష్కారంగా వై.రామవరం మండలంలోని ఎగువ ప్రాంతంగా ఉన్న సుమారు గుర్తేడు, పాతకోట, దారగడ్డ, బొడ్డగండి, కానివాడ, చింతలపూడి పంచాయతీలలోని 59 గ్రామాల కోసం ఈ మండలాన్ని ఏర్పాటు చేస్తున్నారు. గతం కొన్ని దశాబ్ధాలుగా ఈ మండలాల ఏర్పాటుపై టీడీపీ ప్రభుత్వమే ఎంతో కసరత్తు చేసింది. ముఖ్యంగా ఈ ఆరు పంచాయతీలలో అభివృద్ధిపరంగా వెనుకబాటుతనాన్ని ప్రభుత్వం గుర్తించింది. ఈ ప్రాంతంలో ఏ అభివృద్ధి సాగించాలన్నా... ఇక్కడికి సుమారు 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న వై.రామవరానికి చేరుకోవడం, లేదా అధికారులు అక్కడి నుంచి ఇక్కడకు చేరుకోవడం ఎంతో వ్యయ, ప్రయాశలతో కూడినది కావడంతో ఇక్కడ మండలం ఏర్పాటు అనివార్యంగా మారింది. కాగా ఇప్పటికే గుర్తేడుకు పోలీసుస్టేషన్ మంజూరై గత దశాబ్దన్నరకాలంగా మారేడుమిల్లిలో నడుస్తోంది. ఇటీవల కాలంలో గుర్తేడులోనే పోలీసుస్టేషన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ప్రభుత్వం తాజా నోటిఫికేషన్‌తో ఈ మండల ఏర్పాటు కల నిజం కాబోతోంది. జిల్లాల ఏర్పాటు చట్టం కింద గురువారం జారీ చేసిన నోటిఫికేషన్ మేరకు అల్లూరి జిల్లా కలెక్టర్ తదనంతర చర్యలు చేపట్టి ప్రజల నుంచి అభిప్రాయాలను, సలహాలను తీసుకుని నివేదిక సమర్పిస్తే తదనంతరం మరో నోటిఫికేషన్ ద్వారా వై.రామవరం మండలం సరిహద్దులను మార్చి, గుర్తేడు మండలానికి సరిహద్దులను ఏర్పాటు చేసి మరో నోటిఫికేషన్ జారీ చేస్తారు.

సినీ ఫక్కీలో..సచివాలయ ఉద్యోగి కిడ్నాప్

● ఉప సర్పంచ్, సిబ్బందిని కత్తులతో బెదిరించిన వైనం

● ప్రేమికుడిపై అనుమానం.. రంగంలోకి దిగిన పోలీసులు

దేవీపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం దేవీపట్నం మండలం శరభవరం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సోయం సౌమ్యశ్రీ గురువా రం కిడ్నాప్‌కి గురైంది. వివరాలిలా ఉన్నాయి.. సౌమ్యశ్రీ రోజు మాదిరిగానే గురువారం ఉదయం సచివాలయానికి విధులకు వెళ్లింది. అయితే కొద్దిసేపటికే ఇన్నోవా వాహనంలో సుమారు ఏడుగురు వ్యక్తులు సచివాలయంలోకి చొరబడి అక్కడున్న ఉప సర్పంచ్, సచివాలయ సిబ్బందిని కత్తులతో బెదిరించి కిడ్నాప్ చేశారు. ఈ విషయాన్ని వెంటనే సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న రంపచోడవరం డీఎస్పీ, సీఐ సన్యాసిరావు, దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ సిబ్బం ది సంఘటనా ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విస్తృతంగా సాంకేతిక పరిజ్ఞానం తో గాలింపు చర్యలు చేపడుతున్నారు. కాగా గతంలో ఈమె తన ప్రేమికుడు మారేడుమిల్లి మండలం వేటుకూరి గ్రామానికి చెందిన అనిల్‌కుమార్‌తో కలిసి సుమారు నెలరోజులు కనిపించకుండాపోయినట్టు పోలీసులు తెలిపారు. దీనిపై అప్పట్లో కేసు నమోదు చేసి దొరికిన తర్వాత తిరిగి తల్లిదండ్రులకు అప్పగించారు. ఇప్పుడు ఈ కిడ్నాప్ ఘటన చూస్తుంటే ప్రేమికుడు చేసిన వ్యవహారంగా పోలీసులు అనుమా నిస్తున్నారు. దీనిపై సౌమ్యశ్రీ తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై అత్యాచారం కేసులో...

ఒడిశా వాసిపై పోక్సో కేసు నమోదు

సర్పవరం జంక్షన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలోని బంధువుల ఇంటికి వెళ్లిన మైనర్ బాలికకు పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి అత్యాచారం చేయడమే కాకుండా, బ్లాక్ మెయిల్‌కి పాల్పడుతున్న వ్యక్తిపై సర్పవరం పోలీసులు గురువారం పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సూర్యా రావుపేటకు చెందిన మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన 17 ఏళ్ల బాలిక ఇంటర్ చదువుతోంది. ఎనిమిది నెలల కిందట ఒడిశాలోని పూరీలో గల బంధువుల ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో అదే ప్రాంతంలో ఉంటున్న ఒడిశా వాసి కుక్కల దుర్యోధనుడితో పరిచయం ఏర్పడింది. అతని పెళ్లి చేసుకుంటానని చెప్పి సదరు మైనర్ బాలికపై జనవరిలో కాకినాడ రూరల్ రమణయ్యపేట మురళీధర్‌నగర్‌లో ఉన్న ఓ లాడ్జికి రప్పించుకుని అత్యాచారానికి పాల్పడ్డా డు. అనంతరం ఆ సమయంలో తీసిన ఫొటో లతో బ్లాక్ మెయిల్‌కి పాల్పడటమే కాకుండా మరోసారి సదరు లాడ్జికి రావాలని వేధింపులకు గురిచేస్తున్నాడు. నిందితుడి వేధింపులు తట్టుకోలేని బాధితురాలు కుటుంబ సభ్యులకు జరిగిన విషయం చెప్పడంతో బుధవారం సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌హెచ్‌వో బి. పెద్దిరాజు వెళ్లి సదరు లాడ్జిని పరిశీలించి విచారణ చేపట్టారు. దీనిపై హోటల్ తాలూకా రికార్డులు, అనుమతి పత్రాలు, సీసీ ఫుటేజీలను పరిశీలించాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. నిందితుడిపై పోక్సో యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. బాధితురాలిని వైద్యపరీక్షల నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

● పోలీసు కేసు నమోదు



గోపాలకృష్ణ(ఫైల్)

ఉప్పలగుప్తం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): భీమనపల్లి పంచాయతీ భట్టుపాలెంకు చెందిన మోటూరి గోపాలకృష్ణ (35) మోటారుకు వైరు మార్చే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గురువారం కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్టు ఎస్ఐ సీహెచ్ రాజేష్ తెలిపారు.


సీతారాంపురంలో నిరాహార దీక్ష చేస్తున్న ఆయకట్టు రైతులు

కలవచర్ల లిఫ్ట్ ఇరిగేషన్ సాగునీటిని పూర్తిస్థాయిలో విడుదల చేయాలి

- ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైనా పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు
- సీతారాంపురంలో నిరాహార దీక్ష చేపట్టిన ఆయకట్టు రైతాంగం

రాజానగరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : కలవచర్ల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పూర్తిస్థాయిలో సాగు నీటిని విడుదల చేయాలని కోరుతూ రాజానగరం మండలం సీతారాంపురం గ్రామంలో ఆయకట్టు రైతులు గురువారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా ఆయకట్టు రైతులు మాట్లాడుతూ 2001లో రూపుదిద్దుకున్న కలవచర్ల లిఫ్ట్ఇరిగేషన్ రెండు దశాబ్ధాలకు పైబడి నిరాటంకంగా మూడు మోటార్ల ద్వారా సాగునీరు విడుదలయ్యేదన్నారు. గత ఏడాది నుంచి రెండు మోటార్లు తిప్పకుండా కేవలం ఒక్క మోటారు ద్వారా మాత్రమే సాగు నీటిని విడుదల చేస్తున్నారన్నారు. దీంతో ఆయకట్టు పరిధిలోని కలవచర్ల, సీతారాంపురం, సింగరంపాలెం, మూరారి గ్రామాలకు చెందిన 3వేల ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగునీరు విడుదల కాకపోవడంతో ఆయకట్టు రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈవిషయమై సంబంధిత అధికారులకు, స్థానిక ఎమ్మెల్యేకు అనేక సార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదని రైతులు ఆరోపించారు. దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు హయాంలో ఆవిర్భవించిన కలవచర్ల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఇప్పటికే నిరంతరాయంగా పంటలు పండించుకుంటున్నామని, మొట్టమొదటసారి ఆకుమడులు ఎండిపోయిన పరిస్థితి దాపురించిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారంరోజులలోపు మూడు మోటార్ల ద్వారా సాగునీటిని విడుదల చేయకుంటే ఉద్య మా న్ని ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు. తొలిరోజు దీక్షా శిబిరాన్ని జక్కంపూడి విజయలక్ష్మి, మేడా గురుదత్తప్రసాద్ దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లు చోరీతో సాగు నీటి ఇక్కట్లు

కలవచర్ల లిఫ్ట్ ఇరిగేషన్ కోసం కోరుకొండ మండలం గాదరాడ సమీపంలో ఏర్పాటు చేసిన మూడింటిలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించడంతో కేవలం ఒక్కమోటారు మా త్రమే పనిచేస్తున్నట్లు తెలిసింది. టాన్స్‌ఫార్మర్ల చోరీ విషయమై అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో రాజమహేంద్రవరం విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లినట్లుగా గ్రామస్థులు చెబుతున్నారు.


రామవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

హర్ ఘర్ తిరంగ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం రామవరంలో హర్ ఘర్ తిరంగ కార్యక్రమ అనపర్తి పరిశీలకుడు ఆకుల శ్రీధర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈనెల 10నుంచి 15వ తేదీ వరకు బీజేపీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. దీనిలో భాగంగా 10నుంచి 13వరకు ప్రతి గ్రామంలోను తిరంగ ర్యాలీలు నిర్వహించాలని 14న దేశ విభజన గురుంచి తెలిపే విధంగా కాగడాల ప్రదర్శన నిర్వహించాలని అన్నారు. 15న ప్రతి బీజేపీ కుటుంబ సభ్యుడు కుటుంబ సభ్యులతో కలిసి ఇంటిపై జాతీయ జెండాను ఆవిష్కరించాలని నియోజకవర్గ పరిధిలో ఒకచోట బీజేపీ జెండాను ఆవిష్కరించాలని అన్నారు. 10న అనపర్తి మండలంలో భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించామని రామవరం నుంచి అనపర్తి వరకు ర్యాలీ నిర్వహించనున్నామని అన్నారు. 11న బిక్కవోలులో, 12న రంగంపేటలో, 13న పెదపూడిలో భారీ బైక్ ర్యాలీలు, 14న అనపర్తి మెయిన్‌రోడ్డులో కాగడాల ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివరామకృష్ణంరాజు, మల్లిడి సురేంద్రరెడ్డి, గొల్లు హేమతులసి, కర్రి బులిరెడ్డి పాల్గొన్నారు.

నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం విజయవంతం చేయాలి

కడియం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 12న జరిగే నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సన్నాహక సమావేశం జరిగింది. ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వ యంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె రమేష్, డా. ఎన్ జెస్సీసుప్రియ, డా. ఎం మణిజ్యోత్స్న, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


లక్ష్మీనరసాపురం గురుకుల కళాశాలకు ఫ్యాన్లు, లైట్లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

అనపర్తి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ పాఠశాలలో గురువారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వ హిం చార ు. 1994నుంచి 2002 వరకు ఇంటర్ వరకు విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు 23 సంవత్సరాల తరువాత కలుసుకుని సందడి చేశారు. ఎనిమిదేళ్ళ పాటు వసతి గృహంలో చదువుకుని విడిపోయిన వీరం తా ఒకేచోట కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధు లు లేకుండా పోయాయి. వీరంతా అదే కళాశాలలో కలుసుకోవడమే కాకుండా పాఠశాలకు 20 ఫ్యాన్లు, 20 లైట్లు బహూకరించి తమకు పాఠశాల పట్ల ఉన్న ప్రేమను చాటుకున్నారు. సాయంత్రం వరకు సందడి చేసిన పూర్వ విద్యార్థులంతా తమ ఇండ్లకు తిరిగి పయనమయ్యారు. పూర్వ విద్యార్థులు తాము ఇలా కలుసుకునేందుకు సహకరించిన ఎస్ఎంసీ చైర్మన్ కర్రి రాజారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి జీవనాధారం

- సీడీపీవో కృష్ణవేణి

రంగంపేట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తల్లి పాలు శిశు ఆరోగ్యానికి జీవనాధారం రంగంపేట ఐసీడీఎస్ సీడీపీవో కె.కృష్ణవేణి అన్నారు. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గురువారం రంగంపేట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లిపాలు శిశువుకు మొదటి టీకా లాంటిది, ఇవి శిశువును అనేక వ్యాధుల నుంచి రక్షిస్తాయన్నారు. తల్లిపాలు ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తూ ఆరోగ్య పోషకాహారంపై సూపర్‌వైజర్ ఎస్.వి.రమణాంజలి వివరించారు. అనం తరం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అలాగే సుభద్రంపేటలో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పోతుల చిన్నికాపు,దూబాసి వరప్రసాద్, తాతారావు, కృష్ణమూర్తి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాల ముగింపు

రాజమహేంద్రవరంకల్చరల్: తల్లిపాలు బిడ్డకు అన్నివిధాలా శ్రేయస్కరం అని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. తల్లి పాల వారోత్సవాలలో భాగంగా చివరిరోజు గురువారం కంబాలపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంవద్ద జిల్లాఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో తల్లి పాల అవశ్యకతపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు అన్నివిధాలా శ్రేయస్కరమని, తల్లిపాలకు ప్రత్యామ్నాయంలేదన్నారు. కార్యక్రమంలో డీఈవో డాక్టర్ కోమల, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సరిత, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బిందు, హాస్పిటల్ ఎడ్వైజరీ కమిటీ చైర్మన్ ఎ.శ్రీనివాసరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యవేణి, భవాని, జీఎస్ఎల్ నర్సింగ్ కళాశాల విద్యార్థి నులు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్స్ ఆశా కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.


తల్లిపాల అవశ్యకతపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు

తల్లిపాలు ముద్దు... పోతపాలు వద్దు...

కడియం: తల్లిపాల ద్వారానే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, మాజీ సర్పంచ్ గుర్రపు సత్యనారాయణలు తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం దుళ్ళలో కమ్యూనిటీ పారామెడిక్, అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం నుంచి మార్కెట్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఉపసర్పంచ్ తోకల శ్రీనివాసరావు, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బళ్ళ శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి. దేవానంద్, జిల్లా ఉపాధ్యక్షులు రెహ్మాన్‌ఖాన్, కడియపులంక పీహెచ్‌సీ డా. జెస్సీ సుప్రి య, ఎంపీటీసీ కట్టుంగ నాగరాజు, మాజీ సర్పంచ్ చిట్టూరి అమ్మిరాజు, ముమ్మిడి దేవీనాగేశ్వరరావు, తూ ము శ్రీను, సూరపురెడ్డి భరత్, పీఎంపీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో రోడ్డు అభివృద్ధి చేయాలని ధర్నా

సీతానగరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తొర్రేడు నుంచి రఘుదేవపురం వరకు 66 అడుగుల వెడల్పున నాలుగు లైన్ల రోడ్డు వేస్తే ప్రస్తుతం రఘుదేవపురం నుంచి సీతానగరం వరకు 33 అడుగుల వెడల్పుతో రోడ్డు వేయడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ గురువారం వైసీపీ నాయకులు డాక్టరుబాబు, పెందుర్తి దేవదాసు, ఎంపీపీ గగ్గర జ్యోత్స్న, కోండ్రపు ముత్యాల ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు రఘుదేవపురం ఎన్టీఆర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. సీతానగరం- రాజమహేంద్రవరం ఆర్ అండ్ బీ రోడ్డు 4 లైన్ల రోడ్డు తొర్రేడు నుంచి 66 అడుగుల వెడల్పున రఘుదేవపురం వరకు వేసి వదిలేశారు. రఘుదేవపురంలో కొంతమంది న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే ఆర్డర్ పొందడంతో పనులు నిలిచిపోయాయి. సీతానగరం నుంచి రఘుదేవపురం వరకు సుమారు 3 కి.మీ రోడ్డు భారీ గోతులతో ప్రమాదకరంగా మారడంతో ప్రస్తుతం 33 అడుగుల వెడల్పున రోడ్డు పనులు చేపట్టారు గత ప్రభుత్వంలో 66 అడుగుల వెడల్పున రోడ్డు పనులు చేస్తే ప్రస్తుతం రఘుదేవపురం నుంచి 33 అడుగులు రోడ్డు వేయడమేమిటని వైసీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు ఇదికూడా 66 అడుగుల వెడల్పున రోడ్డు అభివృద్ధి చేయాలని వారు కోరారు.

వాట్సప్ గవర్నెన్స్‌పై విస్తృత ప్రచారం చేయాలి

కోరుకొండ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం బూరుగుపూడి సచివాలయాన్ని గురువారం ఆకస్మికంగా ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ సందర్శించి కార్యాలయ పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా మన మిత్ర వాట్సాప్ సేవలు (9552300009) అమలుపై సిబ్బందిని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. అనం తరం అన్నదాత సుఖీభవ, సీఆర్‌సీసీ కార్డులు, నీటి పన్ను వంటి సేవలను వేగవంతంగా పూర్తిచేయాలని వీఆర్వోలకు ఆదేశాలు జారీచేశారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలులో సచివాలయ సిబ్బంది బాధ్యతను అత్యంత కీలకంగా పేర్కొన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలపై లబ్ధిదారులకు తగిన సూచనలు అందించాలన్నారు. అ ర్హులైన వారు తప్పకుండా పథకాల లబ్ధి పొందేలా చూ డాలని సూచించారు. సచివాలయ సిబ్బంది పనితీరు, సేవల పర్యవేక్షణ, ప్రజలతో అనుసం ధానం అంశాలపై పలు సూచనలు చేశారు.

మల్లవరంలో గ్రామసభ

గోకవరం, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): రీసర్వే ప్రాజెక్టులో భాగంగా మండలంలో పైలట్ గ్రామమైన మల్లవరం గ్రామంలో గురువారం గ్రామసభ జరిగింది. రాజమహేం ద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్ అధ్యక్షతన ఫైనల్ ఆర్వోఆర్ గ్రామసభ నిర్వహించారు.

సత్తెమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి రూ.8లక్షల విరాళం



సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం 2వ డివిజన్‌లో నారాయణపురం వాంబేకాలనీలో ఉ న్న సత్తెమ్మతల్లి ఆలయానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు రూ.8లక్షల విరాళం ప్రకటించారు. ఆదివారం ఆలయ పునర్‌నిర్మాణ పనులకు ఆదిరెడ్డి వాసు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి భవానీ చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ.8లక్షలు అందిస్తున్నామన్నారు. ముందుగా రూ.50వేలను ఆలయ కమిటీకి అందించారు. ఇటువంటి ఆధ్యా త్మిక కార్యక్రమాలకు విరాళం అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నగరంలో 45వ డివిజన్ ఆనంద్‌నగర్‌లో రామాలయ నిర్మాణం కోసం, నగరంలోని పలు మసీదుల వద్ద షెడ్డుల ఏర్పాటుకోసం, రక్షణ గోడల కోసం, నమాజ్‌లు చేసుకునేందుకు గదుల నిర్మాణం కోసం ఇంకా అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకోసం విరాళాలు ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా తమ ట్రస్ట్ ద్వారా అనే కమంది పేద విద్యార్థులకు ఫీజులు, పేదలకు వైద్యం నిమిత్తం ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ నాయకులు కాశిన వీన్‌కుమార్, మజ్జి రాం బాబు, బుడ్డిగ రాధా, ఉప్పులూరి జానకి రామయ్య, సలాది ఆనంద్, ఎం.రవియాదవ్, కంటిపూడి శ్రీనివాస్, కోసూరి చండీప్రియ, కడలి రామకృష్ణ, దాస్యం ప్రసాద్, జక్కంపూడి అర్జున్, దొంగా నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు విషయ పరిజ్ఞానం పెంచుకోవాలి

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పిల్లలు పలు అంశాలపై విషయ పరిజ్ఞానం పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. గురువారం ఆమె వీరభద్రాపురం మునిసిపల్ హైస్కూల్‌ని సందర్శించారు. మంచి, చెడు స్పర్శలు, నల్సా వారి పిల్లలకు స్నేహపూర్వక చట్టపరమైన సేవలు, మాదకద్రవ్యాలవల్ల కలిగే దుష్ప్రభావాలు, బాల్య వివాహాల నిర్మూలన తదితర అంశాలపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల అమాయకత్వాన్ని అవకాశంగా తీసుకొని కొందరు వారిపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. మోస పూరితంగా అక్రమ కార్యకలాపాలకు వినియోగిస్తున్నారని చెప్పారు. అందువల్ల పిల్లలు చాలా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎవరూ పిల్లల పట్ల హద్దులు దాటి ప్రవర్తించరాదన్నారు. డీఎల్ఎస్ఏ ద్వారా అందజేస్తున్న న్యాయసేవల గురించి వివరించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు.

పారిశుధ్యం నిర్వహణకు సదుపాయాలను కల్పిస్తాం

- ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి


పారిశుధ్య ట్రాక్టరు ట్రక్కును నడుపుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకోసం అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం అనపర్తి పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య నిర్వహణకు రూ.2.50లక్షల నిధులతో సమకూర్చిన ట్రక్కును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ట్రాక్టరు నడిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎమ్ పీడీవో ఎమ్ రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ అనిల్‌కుమార్, సర్పంచ్ వారా కుమారి, కర్రి శేషారత్నం, కూమి నాయకులు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో రక్షాబంధన్

రాజమహేంద్రవరంకల్చరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక బర్మా కాలనీలో గల ఆర్‌సీఎస్ మిల్స్ నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో, రాజమండ్రి భారత వికాస్ పరిషత్ గోదావరిశాఖ అధ్యక్షురాలు రత్నాంబ ఆధ్వర్యం లో రక్షాబంధన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి వందేమాతరం గీతాలాపనతో వేడుక కార్యక్రమం ప్రారంభించారు. సౌత్ రీజియన్ టీం జనరల్ సెక్రటరీ డి.పురుషోత్తమశాస్త్రి, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వీవీఎస్ కృష్ణారావు, బి.అనూరాధ, పీవీఎస్ నారాయణ, టి.సాయికృష్ణ, కె.వీర్రాజు, పి.అవనిజ, రత్నకుమారి సందేశాన్ని వినిపించారు. కార్ య్రక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ ఎంజీ కెనడీబాబు, బీవీపీ సభ్యురాలు కె. ధనలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాఖీ పండగ సోదర భావాన్ని పెంపొందించాలి

అనపర్తి, ఆగస్టు 7 (ఆంధ్రజోతి) : రాఖీ పండగ ప్రతి ఒక్కరిలోను సోదర భావాన్ని పెంపొందించాలని అనపర్తిలోని లావణ్య స్కూల్ కరస్పాండెంట్ శీరం నాగార్జున అన్నారు. గురువారం పాఠశాలలో ముందస్తు రాఖీ పండుగ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు తమ స్నేహితులకు రాఖీలు కట్టి సోదరభావాన్ని ప్రకటించుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు రాఖీ పండగ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



స్థానిక బర్మా కాలనీలో భారత్ వికాస్ పరిషత్ గోదావరి శాఖ ఆధ్వర్యంలో, అనపర్తిలోని రాఖీలు కడుతున్న చిన్నారులు

ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలి


కాతేరులో చేనేత కార్మికులను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరంరూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రతిఒక్కరూ ఖాదీ వస్త్రాలను కొనుగోలు చేయాలని తద్వారా చేనేత కార్మి కులు అండగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పిలుపునిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని జిల్లా ఇన్‌చార్జ్ యానాపు యేసు ఆధ్వర్యంలో రూరల్ మండలం కాతేరులో చేనేత వర్తక సంఘం సొసైటీ సభ్యులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నాగేంద్ర, రాష్ట్ర ఓబీసీ నాయకుడు గోపీ శీనివాస్ తదితరులు మాట్లాడుతూ భారత స్వాతంత్రం స్వదేశీ ఉద్యమంలో మహాత్మాగాంధీ ఖాదీ ఉద్యమం చేనేత దారాలు బ్రిటీష్ పాలనకు తాళాలుగా మారాయన్నారు. ఈ కార్యక్రమంలో రేలంగి శీదేవి, మద్దిపాటి రవి, తనుబుద్ది సూర్యభాస్కరరావు గంగిన జాహ్నవి, పన్నాల వెంకటలక్ష్మి పలువురు కూట మి నాయకులు పాల్గొన్నారు. అనంతరం చేనేత కార్మికు లను పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.

చేనేతకు మంచి రోజులు

- టీడీపీ రాష్ట్ర నాయకుడు రవిరామ్‌కిరణ్

కడియం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో చేనేత పరిశ్రమకు మంచి రోజులు వచ్చాయని టీడీపీ రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి డా. గోరంట్ల రవిరామ్‌కిరణ్ పేర్కొన్నారు. పొట్టిలంకలో చేనేత దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డా. గోరంట్ల రవిరామ్‌కిర్ పాల్గొన్నారు. గోరంట్ల రవిరామ్‌కిరణ్ స్వీయనిధులతో సమకూర్చిన చీరలను మహిళ నేత కార్మికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలిదిండి గోవిందు, కొత్తపల్లి శ్రీరామ్, వాసా శ్రీనివాస్, తుమ్మా నాగేంద్ర, కలిదిండి సత్యనారాయణ, నీళ్ళ సత్తిబాబు, వాసా వీరభద్రరావు, మొగలపు రాజు, చల్లా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వినాయక మండపానికి రాట ముహూర్తం

ధవళేశ్వరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక రథం వీధిలో 12వ వార్షికోత్సవ గణపతి నవరాత్రుల మహోత్సవాలు నిర్వహించడానికి జనసేన నాయకుడు యడ్ల మహేష్ ఆధ్వర్యంలో పందిరి రాట ముహూర్తం చేశా రు. స్థానిక మహిళలు, ప్రత్యేక పూజలు నిర్వహించి పందిరి రాట వేశారు.

సొసైటీలకు చైర్మన్ల నియామకం

రాజానగరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వివిధ గ్రామాల్లోని సొసైటీలకు చైర్మన్లను నియమిస్తూ జిల్లా సహకార శాఖాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో కానవరంలోని శ్రీరామకృష్ణ విశాల పరపతి సంఘం(సొసైటీ)చైర్మన్‌గా ఫరిజల్లిపేటకు చెందిన నాతిపాం దొరబాబు, భూపాలపట్నం సొసైటీకి చైర్మన్‌గా మద్దిరెడ్డి సుబ్బారావు, నందరాడ సొసైటీ చైర్మన్‌గా గోలి రాజు, దివాన్‌చెరువు సొసైటీ చైర్మన్‌గా ముత్యం వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈసం దర్భంగా చైర్మన్లుగా నియమితులైన వారికి నాయకులు, అభిమానులు, స్నేహితులు అభినందనలు తెలియజేశారు.

కోరుకొండ పీఏసీఎస్ చైర్మన్‌గా బత్తుల గోపాలకృష్ణ



కోరుకొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిస భ్య కమిటీ చైర్మన్‌గా గాదరాడ గ్రామానికి చెందిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సోదరుడు బత్తుల గోపాలకృష్ణను నియమించారు. అదేవిధంగా ఇతనితో పాటు త్రిసభ్య కమిటీలో మరో ఇద్దరు సభ్యులను కూడా నియమించారు. వీరిలో టీడీపీ నాయకుడు సుంకర వెంకట నరసింహారావు, దేవన దుర్గాప్రసాద్‌లు ఈ త్రిసభ్య కమిటీలో సభ్యులుగా నియమించారు. కోరుకొండ పీఏసీఎస్ పరిధిలో గాదరాడ, కణుపూరు, రాజవరం, నర్సాపురం, జంబుపట్నం, పశ్చిమగోనగూడెం, కోరుకొండ, కాపవరం, మునగాల, బుచ్చింపేట గ్రామాలు ఉన్నాయి. మండలంలోనే 10 గ్రామాలకు చెందిన అతిపెద్ద రైతు సహకార సంఘంగా ఉన్న కోరుకొండ సొసైటీకి చైర్మన్‌గా ఎంపిక చేయడంపట్ల ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకట రమణ చౌదరి, బీజేపీ ఇన్‌చార్జ్ నీరుకొండ వీరన్న చౌదరికి బత్తుల గోపాలకృష్ణ ధన్యవాదాలు తెలిపారు.

స్ఫూర్తి చారిటబుల్ ట్రస్టు చైర్మన్‌కు శ్రీకృష్ణదేవరాయ అవార్డు



ధవళేశ్వరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్ఫూర్తి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముత్యాల పోసికుమార్ కాపు జేఏసీ ప్రధానం చేసిన శ్రీకృష్ణదేవరాయ అవార్డు అందుకున్నారు. గురువారం గుంటూరులోని విజ్ఞాన మందిరంలో శ్రీకృష్ణ దేవరాయ 10వ పట్టాభిషేక మహోత్సవాన్ని కాపు జేఏసీ చైర్మన్ అమ్మ శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి చారిటబుల్ ట్రస్టును ఏర్పాటుచేసి వృద్ధు లకు, అనాథలకు ఆశ్రయం కల్పిస్తున్న పోసికుమార్‌ను అవార్డుతో సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పోలీసులకు గాయాలు

అనపర్తి ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఒక కేసు నిమిత్తం నిజామాబాద్ వెళ్లిన అనపర్తి పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్ళు హనుమాన్ జంక్షన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. అనపర్తి పోలీస్‌స్టేషన్‌లో పీసీలుగా విధులు నిర్వహిస్తున్న తమ్మారావు, వెంకటేష్‌లు కేసు నిమిత్తం నిజామాబాద్ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వీరు ప్రయాణిస్తున్న కారు హనుమాన్ జంక్షన్ వద్ద ముందు వెళుతున్న లారీ బ్రేక్ వేయడంతో వీరి కారు లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పోలీసులకు తీవ్రగాయాలు కావడంతో అక్కడే ప్రథమ చికిత్స నిర్వహించి రాజమండ్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. వీరు ప్రస్తుతం రాజమండ్రిలో చికిత్స పొందుతున్నారని స్థానిక పోలీసులు తెలిపారు.

60 లీటర్ల సారా స్వాధీనం

రంగంపేట,ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల మండలం ఈలకొలను, సింగంపల్లి గ్రామాల్లో ఎక్సైజ్ పోలీసులు గురువారం నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి పడాల శ్రీను, కోట చిన్నరాజు అనే ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 60లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని, లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సి.ఐ సుధ తెలిపారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: సార్ మేడమ్
సూర్యమినీ	: మహావతార్ నరసింహ
సూర్యప్యాలస్	: కింగ్‌డమ్
స్వామి	: హరిహర వీరమల్లు
అనుశ్రీ(సాయికృష్ణ)	: హరిహర వీరమల్లు
శివజ్యోతి	: సార్ మేడమ్
రాజా	: కింగ్‌డమ్
ఊర్వశి	: మహావతార్ నరసింహ
మేనక	: సన్ ఆఫ్ సర్దార్-2
రంభ	: జూనియర్
అప్సర	: కింగ్‌డమ్
అశోక	: కింగ్‌డమ్
వీఎస్ మహల్(నామవరం)	: కింగ్‌డమ్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: కింగ్‌డమ్
వెంకటసూర్య(కడియం)	: కింగ్‌డమ్
సత్యగౌరి (అనపర్తి)	: మహావతార్ నరసింహ
సూర్యశ్రీ (అనపర్తి)	: హరిహర వీరమల్లు
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: కింగ్‌డమ్
రామకృష్ణ(కోరుకొండ)	: మహావతార్ నరసింహ
గీతాసినిమాస్ (సీతానగరం)	: మహావతార్ నరసింహ
శ్రీనివాస (గోకవరం)	: కింగ్‌డమ్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: మహావతార్ నరసింహ
లలితామహల్(రంపచోడవరం)	: హరిహర వీరమల్లు
నవయుగ(చింతూరు)	: హరిహర వీరమల్లు



కార్డు ఉంటే ఓకే!

ఏఎంసీ చెక్‌పోస్టుల్లో డిజిటల్ సేవలు ఆరంభం

పెరవలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో డిజిటలైజేషన్ వైపు అడుగులు పడుతున్నాయి.ఎక్కడైతే డిజిటల్ సేవలు అందుబాటులో లేవో గుర్తించి ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకూ ఏఎంసీ చెక్‌పోస్టుల్లో డిజిటల్ చెల్లింపుల విధానం లేదు. ఇదిలా ఉండగా పెరవలి ఏఎంసీ చెక్‌పోస్టు వద్ద డిజిటల్ చెల్లింపుల పైలెట్ ప్రాజెక్టును గురువారం కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించి మాట్లాడారు. మార్కెట్ యార్డుల్లో నగదు లేని పారదర్శక విధానికి తెరలేపామన్నారు. ఇప్పటి వరకు చెక్కుపోస్టుల్లో నగదు రూపంలో వసూలు చేసిన మార్కెట్ ఫీజును ఇకపై ఈ పోస్ యంత్రాలు ద్వారా మాత్రమే వసూలు చేస్తారని.. డిజిటల్ రశీదు అందుతుందన్నారు. దీని వల్ల ఆదాయంలో పారదర్శకత పెరిగి, కమిటీల ఆదాయం గణనీయంగా పెరుగుతుందన్నారు.కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ మార్కెట్ ఫీజుల డిజిటల్ వసూలు విధానం ద్వారా ఆదాయ లక్ష్యాలను వంద శాతం చేరుకోవచ్చున్నారు. నకిలీ రశీదుల వల్ల జరిగే అక్రమాలకు చెక్‌పడుతుందన్నారు.కార్యక్రమం లో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, జనసేన మండల అధ్యక్షుడు పిప్పర రవి, టీడీపీ నాయకులు అతికాల శ్రీను, వీరవల్లి శ్రీను,సలాది కృష్ణమూర్తి పాల్గొన్నారు.



పెరవలి ఏఎంసీ చెక్‌పోస్ట్ వద్ద డిజిటల్ సేవలు ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

ఇన్నాళ్లకు గుర్తొచ్చానా వానా!



నిడదవోలులో కురుస్తున్న వాన



గోపాలపురంలో జలమయంగా మారిన లోతట్టు ప్రాంతం


నిడదవోలు/గోపాలపురం

నిన్నటి వరకూ భానుడు వదల్లేదు..వరుణ జాడలేదు.. ఒక పక్క జనం ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు.. ఈ కాలంలో ఇదేంటిరా దేవుడా అంటూ ఆపసోపాలు పడుతున్నారు.. ఉదయం నుంచి సాయంత్రం ఏదో ఎండాకాలంలా ఉంటుంది. బుధవారం రాజమహేంద్రవరం 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. జనం బయటకు రావడానికే భయపడుతున్నారు.. అటువంటిది గురువారం రెండు ప్రాంతాలను వరుణుడు కరుణించాడు.. నిడదవోలులో గురువారం ఉదయం నుంచి భానుడి భగభగలతో జనం ఉక్కపోతకు గురయ్యారు.. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పువచ్చింది.. సుమారు గంటసేపు వరుణుడు దంచికొట్టాడు.. గోపాలపురంలోనూ వరుణుడు సాయంత్రం 4 గంటల నుంచి చితక్కొట్టాడు.. కాస్త చల్లబడడంతో ఆ రెండు మండలాల్లో జనం ఊపిరిపీల్చుకున్నారు.

పట్టాదారు.. పాస్!



మళ్లీ మంచి రోజులు..



జగన్ బొమ్మతో జారీ చేసిన పాస్‌బుక్‌లను నిలిపివేసి ఆంధ్రప్రదేశ్ రాజముద్రతో కొత్త బుక్‌లను ప్రభుత్వం సిద్ధం చేసింది. వీటిని ఆగస్టు 15న రీసర్వే పూర్తయిన గ్రామాల్లో పంపిణీ చేయబోతోంది. ఇప్పటికే ఇవన్నీ ఆయా జిల్లా కలెక్టర్ కార్యాలయాలకు చేరుకున్నాయి. కాకినాడ జిల్లాకు మొత్తం 1.47 లక్షలు, కోనసీమ 1.02 లక్షలు, తూర్పుగోదావరి జిల్లాకు 95 వేల వరకు వచ్చాయి. వీటిని ఆయా మండలాలకు తరలించి రైతులకు పంపిణీ చేయనున్నారు. ఒక రకంగా చెప్పాలంటే అనేక ఏళ్ల తర్వాత మళ్లీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తళతళలాడే పాస్‌బుక్‌లు రైతులకు అందబోతున్నాయి. ఈ పాస్ బుక్‌లపై క్యూఆర్‌కోడ్‌తోపాటు ఆధార్ నెంబరు ఉంటుంది. దీని ఆధారంగా ప్రతి యజ మాని తమ సొంత భూమి వివరాలు తెలుసు కునే వెసులు బాటును ప్రభుత్వం కల్పించింది. మరో పక్క పంపిణీ చేసిన పాస్ పుస్తకాల్లో తప్పులుంటే వెనక్కు తీసుకుని మళ్లీ కొత్తవి జారీ చేయనున్నారు. కొత్త పాస్‌బుక్‌లతో భూ య జమానుల సమస్యలు తీరనున్నాయి.

ఈ నెల 15 నుంచి కొత్త పాస్‌బుక్‌లు

- ఉమ్మడి జిల్లాలో పంపిణీకి శ్రీకారం
- 3.44 లక్షల పాస్ పుస్తకాలు రాక
- గతంలో జగన్ బొమ్మతో జారీ
- రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత
- కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదులు
- మళ్లీ రాజముద్రతో పాస్‌బుక్‌లు
- నేడో రేపో రైతులకు అందజేత

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 15 నుంచి రైతులకు కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీకి రంగం సిద్ధమవుతోంది. భూసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు కొత్త పాస్ పుస్తకాలను అధికారులు అందించనున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ బొమ్మతో రైతులకు పాస్ పుస్తకాలు అరకొరగా ఇవ్వడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో వీటి పంపిణీకి బ్రేక్ పడింది.ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మునుపటిలా ఆంధ్రప్రదేశ్ రాజ ముద్రతో కొత్త పాస్‌పుస్తకాల జారీకి రెవెన్యూ శాఖ నిర్ణయించింది. ఎట్టకేలకు ఇవన్నీ జిల్లాలకు చేరుకున్నాయి. ఆగస్టు 15న వీటిని రీసర్వే పూర్తి చేసుకున్న గ్రామాల్లో పంపిణీ చేయనున్నారు.

నేటికీ 1920 నాటి లెక్కలే..

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ,ప్రైవేటు భూముల సర్వే 1920లో జరిగింది. దీని ప్రకారమే 2022 వరకు భూ లావాదేవీలు జరిగాయి.వాస్తవానికి 1920లో జరిగిన భూసర్వే 30 ఏళ్ల పాటు మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలి.ఆ తర్వాత మళ్లీ భూ రీసర్వే జరగాలి. కానీ అనేక కారణాలతో సర్వే జరగలేదు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు భూమి ఏదైనా సరే వివాదం తలెత్తితే 1920 నాటి రీ సర్వే రిజిస్టర్ (ఆర్ఎస్ఆర్) మాత్రమే రెవెన్యూ శాఖకు ప్రామాణికంగా మారింది. ఈ వందేళ్లలో అనేక మార్పులు వచ్చాయి. కానీ ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం వందేళ్ల కిందట స్థితిగతుల ప్రకారమే కొనసాగుతున్నాయి.మరో పక్క ఎక్కడైనా వందెకరాల భూమి ఉంటే దానికి ఏకమొత్తంగా ఒకే సర్వే నెంబర్ మాత్రమే కొనసాగుతోంది. ఈ సర్వే నెంబర్‌లో యాభై,అరవై మందికి భూమి ఉంటుంది. వీరు క్రయవిక్రయాలు జరిపితే ఒకే సర్వే నెంబరే అందరికీ ప్రామాణికంగా కొనసాగుతోంది. దీని వల్ల అనేక భూ వివాదాలు తలెత్తుతున్నాయి.

40 వేల మంది విజ్ఞప్తులు..

గత వైసీపీ ప్రభుత్వంలో రెవెన్యూ శాఖ అస్తవ్యస్తంగా మారింది. రైతుల భూములు కొనుగోలు చేసి ఏళ్లు దాటినా పాస్ బుక్‌లు అరకొరగా ఇచ్చారు. వాస్తవానికి ఇవి ఉంటేనే భూముల క్రయవిక్రయాలు సాగుతాయి. రైతులకు రుణాలు వస్తాయి.కానీ జగన్ సర్కారు అప్పట్లో ఇదేదీ పట్టించుకోలేదు. పాస్ పుస్తకాల కోసం తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ రైతులు కాళ్లరిగేలా తిరిగినా ఖాతరు చేయలేదు. అదే సమయంలో అప్పటి ప్రభుత్వం కొత్తగా 2022 సమగ్ర భూ సర్వే చేపట్టి అరాచకం సృష్టించింది. దీనిపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విసిగెత్తిపోయిన 40 వేల మందికిపైగా బాధితులు న్యాయం చేయాలంటూ కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందించారు. వీటిపై ప్రభుత్వం దృష్టి సారించి గ్రామాల వారీగా బాధితుల సమస్యలు వింటూ తిరిగి రీసర్వే చేపట్టింది. రీసర్వేలో సంబంధిత భూయజమానులకు ముందే సమాచారం ఇచ్చి సర్వే చేపట్టారు.ఇలా ఉమ్మడి జిల్లాలో 600 గ్రామాల్లో సమస్యలు చాలా వరకు పరిష్కరించారు.

600 గ్రామాల్లో అస్తవ్యస్తం..

గత వైసీపీ ప్రభుత్వం సమగ్ర భూ సర్వే చేయ డానికి కసరత్తు జరిపింది. ఒక్కో సర్వే నెంబర్‌లో ఎంత మందికి భూములున్నాయనేది గుర్తించి ఆ సర్వే నెంబర్‌లో ఉన్న వారందరికి కొత్తగా సబ్‌డివిజన్ చేసి ప్రతి ఒక్కరికి ఉమ్మడిగా ఇంత కాలంగా ఉన్న సర్వే నెంబర్ స్థానంలో సబ్‌డివిజన్ సర్వే నెంబర్ కొత్తగా కేటాయించాలని నిర్ణయించింది. కానీ ఆచరణలో అప్పటి ప్రభుత్వం విఫలమైంది. సర్వేను వేగంగా పూర్తి చేయాలని ఒత్తిళ్లు తేవడంతో ఈ ప్రక్రియను రెవెన్యూసర్వేశాఖ అధికారులు అస్తవ్యస్తంగా మార్చేశారు.ఉమ్మడి జిల్లాలో ఆరు వందలకుపైగా గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశారు. కాకినాడ జిల్లా 15 మండలాల పరిధిలో 269 గ్రామాలు, తూర్పుగోదావరి జిల్లా 19 మండలాల్లోని 190 గ్రామాలు, కోనసీమ జిల్లాలో 150కిపైగా గ్రామాల్లో సర్వే చేశారు. భూయజమానులు లేకపోయినా పక్క స్థలాల యజమానులను అడిగి రీ సర్వే కానిచ్చేశారు. దీంతో వేలాది మంది భూముల విస్తీర్ణం చాలా వరకు తగ్గిపోయింది. మరి కొందరి విస్తీర్ణం అమాంతం పెరిగిపోయింది. రీసర్వే తప్పులతో భూయజమానుల పేర్లు సైతం మారిపోయాయి. వీటిని సరిచేయాలని వేలాదిగా బాధితులు కాళ్లరిగేలా తిరిగినా ప్రభుత్వం పరిష్కరించలేదు. సర్వే పూర్తయిన గ్రామాల్లో సొంత ప్రచారం కోసం జగన్ బొమ్మతో పాస్‌బుక్‌ల జారీకి అధికారులు ప్రయత్నించారు. ఇది తీవ్ర విమర్శలపాలైంది.





కడియం మండలం మురమండలో ర్యాలీ చేస్తున్న చేనేత కార్మికులు

జిల్లాలో 900 చేనేత మగ్గాలు

చేనేత దినోత్సవంలో హ్యాండ్లూమ్స్ అధికారి రవికుమార్

కడియం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేనేతను ఆదరిద్దాం... చేనేత వస్త్రాలను ధరించాలంటూ చేనేత కార్మికులు గురువారం నినాదాలు చేశారు. కడియం మండలం మురమండ చేనేత సొసైటీ వద్ద జాతీయ చేనేత దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. హేండ్‌లూమ్స్- కాకినాడ విస్తరణాధికారులు సీహెచ్.రవికుమార్,బి.తవిటినాయుడు మాట్లాడుతూ జిల్లాలో సుమారు 900 మగ్గాలు 2,500 మంది నేత కార్మికులు ఉన్నారని తెలి పారు. జిల్లాలో చేనేత కార్మికులకు రూ.13 లక్షల త్రిఫ్ట్ ఫండ్ నిధులు మంజూరయ్యాయన్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ మినహాయింపు కారణంగా సుమారు రూ.15 లక్షలు లబ్ధి కలుగుతుందన్నారు.అంతకు ముందుగా ఏఎంజీ రోడ్డు నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా ర్యాలీ చేశారు. పలువురు నేత కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘ నాయకులు కర్రా వీరభద్రరావు, కుందుం సత్యనారాయణ, యర్రా వీరభద్రుడు, బీరక వీరవెంకట సత్యనారాయణ, యర్రా సూర్యనారాయణ, బత్తుల గణేష్, కొండపల్లి పట్టియ్య,కూటమి నాయకులు ప్రత్తిపాటి రామారావుచౌదరి, యర్రంశెట్టి వీరబాబు, దేవళ్ళ రాంబాబు, వట్టికూటి జానకీరామయ్య, సొసైటీ సీఈవో చింతా పోతురాజు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్లు ఓకేనా!

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అన్న కేంటిన్ల నిర్వహణ చాలా చోట్ల గాలికొదిలేశారు. దీంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.ఈ మేరకు కలెక్టర్ ప్రశాంతికి ఫిర్యాదు అందిందో ఏమో గురువారం ఉన్నట్టుండి రాజమహేంద్రవరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. టోకెన్ కౌంటర్, డైనింగ్ ఏరియా, చేతులు శుభ్రం చేసుకునే ప్రదేశాలను పరిశీలించారు. ఆహారం తీసుకుంటున్న వారితో కలెక్టర్ ప్రశాంతి మాట్లాడి భోజన నాణ్యత, పరిశుభ్రత, వసతుల లభ్యత, సమయ పాలన టోకెన్ల అందుబాటు తదితర అంశాలపై ప్రశ్నించారు. క్యాంటిన్ నిర్వహణ విషయంలో ప్రజల నుంచి అభిప్రాయాలు కూడా క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా సేకరించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఎక్కడైనా తేడా ఉంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మళ్లీ తనిఖీ చేస్తానని తెలిపారు.

64 వేల బంగారు కుటుంబాలు గుర్తింపు

సీఎస్ సమీక్షలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటి వరకు 64 వేల బంగారు కుటుంబాలను గుర్తించామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.అమరావతిలోని తన కార్యాలయం నుంచి జిల్లాల కలెక్టర్లతో సీఎస్ విజయానంద్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. పీ-4 సర్వే, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టిన ప్రాజెక్టులు, ప్రభుత్వ పథకాల అమలు, అన్నదాత సుఖీభవ తదితర అంశాలపై సమీక్షించారు.నీడ్ అసెస్మెంట్ సర్వే ఈ నెల 15లోపు 100 శాతం చేరాలని ఆదేశించారు.రాజానగరం మండలం కలవచర్లలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కులు నెల రోజుల్లో ప్రారంభిస్తామన్నారు.సమావేశం లో డీఆర్వో టీ.సీతారామమూర్తి డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గోకవరం ప్రభుత్వాసుపత్రిలో బాధితులు

జ్వరాలతో వణుకుతున్న గోకవరం

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వద్ద బాధితుల క్యూ

గోకవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సగానికి పైగా గ్రామాల్లో జనం జ్వరాలతో వణికిపోతున్నారు. వాతావరణ మార్పుల కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.జ్వరం, జలుబు, దగ్గు, ఒంటి నొప్పులు, వికారం, వాంతులు, విరేచనాలు, తదితర లక్షణాలతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. కొన్నిచోట్ల పారిశుధ్య లోపం, తాగునీరు క్లోరినేషన్, చేయకపోవడం తదితర కారణాలతో అనారోగ్యం బారినపడుతున్నారు. ఏ ఇంట్లో చూసినా ఎవరో ఒకరు రోగంతో బాధపడేవారే కనిపిస్తున్నారు. గోకవరం ప్రభుత్వాసుపత్రికి రోగులు వచ్చి జాయినవుతున్నారు. మరికొంత మంది ప్రభుత్వాసుపత్రికి వెళితే సరైన వైద్యం అందదేమోననే అపోహతో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం వైరల్ జ్వరాల వ్యాప్తి కనిపిస్తోందని అధికారులు చెప్పుకొస్తున్నారు. కొంత మంది ఆయా గ్రామాల్లో ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వాసుపత్రిలో రోజువారి ఓపీ సుమారు 300 నుంచి 400 వరకు ఉంటుంది. వీరిలో సగం మంది జ్వరం, రొంప, వాంతులు, విరోచనాలు, ఒంటి నొప్పులతో వస్తున్నవారే ఎక్కువగా కనిపిస్తున్నారు. వీరిలో చిన్నారులు కూడా ఉన్నట్టు సమాచారం. ప్రభుత్వాసుపత్రికి వెళితే గంటలు తరబడి నిరీక్షణ తప్పడం లేదని రోగుల సంబంధీకులు వాపోతున్నారు. ఓపీ రాయించుకున్నాక వైద్యుడి వద్దకు చేరుకోవడం ఒక ఎత్తయితే, రక్త పరీక్ష చేయించుకోవడం మరొక సాహసంగా మారుతుందని అంటున్నారు. ఏటా వర్షాకాలంలో జ్వరాల వ్యాప్తి ఉన్నా అరికట్టే దిశగా ప్రభుత్వ యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవడంలేదు. దీంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వ్యాపారులకు.. లక్ష్మీ కటాక్షం!

వరలక్ష్మీ వ్రత సామగ్రి అధరహో





- కొనుగోలుదారుడికి ధరాఘాతం
- గ్రాము రూపు రూ.10,500
- 30 చామంతులు రూ.50
- కొబ్బరికాయ రూ.40
- అరటిపండ్లు అత్తం రూ.100
- కిటకిటలాడిన మార్కెట్లు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 7 (ఆం ధ్రజ్యోతి) : జిల్లాలో శ్రావణ కళ వచ్చింది.. మార్కెట్ శ్రావణ శోభ సంతరించుకుంది. రెండో శ్రావణ శుక్రవారం సందర్భంగా గురువారం మార్కెట్లు కిటకిటలాడాయి. పూజా సామగ్రి కొనుగోళ్లకు జనం పోటెత్తారు. గత నెల 25వ తేదీ నుంచి శ్రావణమాసం ఆరంభమైంది. అప్పటి నుంచి శుభకార్యాలు ప్రారంభ మయ్యాయి. దుస్తులు, వెండి, బంగారు వస్తువుల కొనుగోళ్ల జరుగుతున్నాయి. శుక్రవారం వరలక్ష్మిదేవి వ్రతాన్ని పురస్కరించుకుని నిత్యావసరాలు, పండ్లు, పువ్వులు, బంగారు రూపులు, పత్రులతో మార్కెట్ నిండుగా మారింది. ఒక గ్రాము రూపు రూ.10,500ల వరకు పలకడంతో మహిళలు కొనుగోలుకు వెనుకంజ వేశారు. చాలా మంది అరగ్రాముతో సరిపెట్టారు. అయితే తరుగు మజూరీ దోపిడీ మాత్రం పెద్ద ఎత్తున సా గింది. అరగ్రాము రూపు రూ.6 వేల వరకు ధర పలికినట్టు సమాచారం. పువ్వుల ధరలు అంబరా న్నం టాయి.30 చామంతి పువ్వులు రూ.50లు పలికా యి. ఆరు గులాబీలు రూ.10, రెండు అరటిఆకులు రూ.10, కొబ్బరి కాయలు రూ.30 నుంచి రూ.40ల మధ్యలో పలికాయి. అరటి పండ్లు అత్తం రూ.100లు పలికింది. ఒక్కో కలువ పువ్వులు రూ.10లకు విక్రయించారు. నిత్యావసరాల ధరలు అమాంతంగా పెరిగాయి. యాపిల్ డజను రూ.600, బత్తాయి డజను రూ.300, ద్రాక్ష కేజీ రూ. 150 నుంచి రూ.200, బెల్లం కేజీ రూ.55 నుంచి రూ.65, ఆయిల్ ప్యాకెట్ కేజీ రూ.160 నుంచి రూ.180 పలికాయి. వరలక్ష్మీ వ్రతం చేస్తే లక్ష్మి రావడం ఏమో కానీ గురువారం జేబు మొత్తం ఖాళీ అయిపోయిందని పలువురు వాపోయారు. బంగారం ధర పెరిగినా దుకాణాలు కళకళలాడాయి. రాజమహేంద్రవరంలోని కంబాలచెరువు,దేవిచౌక్, జాంపేట పోలీస్ క్వార్టర్స్ రోడ్డు, దానవాయిపేట, ఏవీఏ రోడ్డు, క్వారీ రోడ్డు, పేపరు మిల్లు రోడ్డు, లాలాచెరువు, ఆర్టీసీ కాంప్లెక్స్, స్టేడియం రోడ్డు, కోటిపల్లి బస్టాండ్, కొవ్వూ రు, నిడదవోలు తదిరత ప్రాంతాలు కొనుగోలు దారులతో కిటకిటలాడాయి.మరో వైపు కడియపులంక పువ్వుల మార్కెట్ కళకళలాడింది. పువ్వుల కొనుగోళ్లు పెద్ద ఎత్తున సాగాయి. చామంతులకు డిమాండ్ ఏర్పడింది.

భక్త 'జన' గోదారి



గోదావరి రేవులు భక్తజనంతో కిటకిటలాడాయి.. శ్రావణ శుక్రవారం సందర్భంగా గురువారం పెద్ద ఎత్తున మహిళలు రాజమహేంద్రవరంలోని పుష్కరఘాట్‌కు చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. ఉదయం నుంచి ఘాట్‌కు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గోదావరిలో దీపాలు వదిలారు.

లైసెన్స్ లేని తుపాకులు కలిగి ఉండడం నేరం : ఎస్పీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ లేని తుపాకులు కలిగి ఉండడం చట్ట రీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ నరసింహ కిశోర్ హెచ్చరించారు. ఏ రకమైన మారణాయుధాలు కలిగి ఉన్నా ఉపేక్షించేది లేదన్నారు. లైసెన్సు లేని, నాటు తుపాకులు ఎవరి వద్ద ఉన్నా వెంటనే దగ్గరలోని పోలీస్ స్టేషనుకు అందజేయాలని పేర్కొన్నారు. కార్డన్ అండ్ సెర్చ్‌లో ఈ అంశానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించామన్నారు.

నూతన వరి వంగడాలు సాగుచేసుకోవాలి

ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్

కోరుకొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రైతు కమతాల్లో ప్రదర్శన నిమిత్తం వేసిన నూతన వరి రకాల ఎదుగుదల, ఆశాజనకంగా ఉందని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు తెలిపారు. కోరుకొండ మండలంలో కోటికేశవరంలో గురువారం పరిశీలించి మాట్లాడారు. సార్వాలో పరిశోధన నిమిత్తం, రైతు కమతాల్లో వేసిన ఎంటీయూ 1443, బీపీటీ 3284, రాగోలు రకాలైన ఆర్‌జీఎల్ 7030,7034, 7038,7039, 7045 వంటి నూతన రకాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయన్నారు. సార్వాలో సాగు చేస్తున్న ఎంటీయూ 1443 ఇటీవల నాట్లు వేశారని.. చీడపీడలు లేకుండా ఆరోగ్యంగా ఉందన్నారు. సక్రమ యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చున్నారు. ఈ క్షేత్ర ప్రదర్శనలో మండల వ్యవసాయ అధికారి రఘుకుమార్, వీఏఏ కోన సత్య ప్రసాద్, అభ్యుదయ రైతులు ముంద్రు వీరభద్రరావు, విస్సా చంద్ర శేఖర్, తాడపాక బాబూరావు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొవ్వూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మున్సిపాల్టీలో జనావాసాల మధ్య పిచ్చిమొక్కలతో నిండి ఉన్న ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసినట్టు మున్సిపల్ కమిషనర్ జి.సందీప్ తెలిపారు. ఈ నెల 4వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో చిట్టడవులు అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి కమిషనర్ స్పందించారు. పట్టణ పరిధిలోని ఖాళీస్థలాలను గుర్తించి పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేయాలని యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఇందులో కొంతమంది స్పందించి స్థలాలను శుభ్రం చేయడానికి ముందుకు రాగా, మిగిలినవారు వారం రోజులు సమయం కావాలని కోరారు. ఈనెల 14వ తేదీ నాటికి పూర్తిగా శుభ్రం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ తెలిపారు. దీనిపై మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, అడ్మిన్, పారిశుధ్య, పర్యావరణ సెక్రటరీతో టీములను ఏర్పాటుచేసి ప్రతిరోజూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తాడిమళ్ల విద్యార్థులు

నిడదవోలు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తాడిమళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బి.ప్రేమ్ కుమార్, ఎన్.గ్రీష్మ, పి.శివ దుర్గా లక్ష్మి, పి.కార్తీక్, పి.వెంకట మురళి ఎంపికైనట్టు హెచ్‌ఎం సీహెచ్ పద్మ తెలిపారు. వీరంతా ఈనెల 9వ తేదీ నుంచి 11 వరకు చీరాలలో జరిగే పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు బండి ప్రదీప్ తెలిపారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు, తదితరులు అభినందించారు.


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం పద్మ

ఘనంగా అమ్మవారి ఆలయ వార్షికోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న సువర్ణరాజు

నల్లజర్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చీపురుగూడెం గ్రామదేవత తుమ్మలమ్మ వారి ఆలయ మూడో వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని భక్తులకు అన్నసమారాధనను ఏర్పాటు చేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. దీనిలో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు చోడసాని బాపిరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గుండాబత్తుల వరుణ్, వీర మహిళ సెందిల్ కుమారి, మండల ఉపాధ్యక్షుడు గుడిశెట్టి శివకృష్ణ, కార్యదర్శి కొత్తపల్లి హరిబాబు, రుద్ర శ్రీను, తలంశెట్టి శ్రీనివాస్, బండి చిట్టి, తలంశెట్టి కోటేశ్వరరావు, గంగారావు, వీరనాగు, సాయిబాబు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

దేవరపల్లి, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖాధికారి కే.కమలరాజు పేర్కొన్నారు. దుద్దుకూరులో గురువారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దుద్దుకూరుకు చెందిన కాకర్ల చంద్రమౌళి వ్యవసాయ క్షేత్రంలో వరి పొలాలు పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిం చారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులు వరిపంటకు దాణా, యూరియా, నానోయూరియా, నానో డీఏపీ వాడాలని సూచించారు. 500 గ్రామాలు నానో యూరియా ద్రావణం ఒక బస్తా యూరియాతో సమానమన్నారు. రైతులకు కావల్సిన ఎరువులు ఆర్‌బీకే కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఉద్యాన వనశాఖాధికారి రమేశ్, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, ప్రకృతి వ్యవసాయ శాఖ, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.


వరి పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖాధికారులు

నిడదవోలును అభివృద్ధి పథంలో నడిపిద్దాం

● రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిడదవోలు పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం నిడదవోలు పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో టౌన్ మాస్టర్ ప్లాన్‌పై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ఏ పట్టణానికైన మాస్టర్ ప్లాన్ అనేది ముఖ్యమైన డాక్యుమెంట్ అని అన్నారు. అలాగే స్థానిక ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని క్షేత్రస్థాయి నుంచి పై స్థాయి వరకు అభిప్రాయాలు , ఆలోచనలు తెలుసుకోవాలన్నారు. స్వర్ణాంధ్ర 2047ను సీఎం చంద్రబాబు రూపొందించారన్నారు. అనంతరం మాస్టర్‌ప్లాన్, పట్టణ అభివృద్ధి, సుందరీకరణ, మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం పలువురు మాట్లాడారు. పలు పార్టీల నాయకులు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ తోట కృష్ణవేణి, వైస్ చైర్మన్లు వజీరుద్దీన్, బాలరాజులు, కౌన్సిలర్లు రతీదేవి, గోపిరెడ్డి శ్రీనివాస్, సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు భద్రం దొర, చిన్నం మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


మునిసిపల్ కార్యాలయంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నూతన రహదారి పనులు ప్రారంభం

గోపాలపురం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కరిచర్లగూడెం నుంచి సంజీవపురం వెళ్లే నూతన రహదారి పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఇటీవల జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు భూమిపూజ చేశారు. నాబార్డు నిధులు రూ. కోటి 50 లక్షలతో 2.9 కిలోమీటర్ల మేర పనులు చేపట్టనున్నారు. దీంతో ఏడు గ్రామాల ప్రజలకు ప్రయాణ సౌలభ్యం కలుగుతుంది.

విద్యకు అధిక ప్రాధాన్యం : ఎమ్మెల్యే ముప్పిడి


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, తదితరులు

తాళ్లపూడి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం వేగేశ్వరపురం జూనియర్ కళాశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో విద్యలో మరిన్ని సంస్కరణలు తీసుకొచ్చి, విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, మాజీ అధ్యక్షులు కైగాల శ్రీనివాసరావు, యువగళం నాయకులు కాకర్ల సత్యేంద్ర, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, దుగ్గిరాల జగదీష్, శంకరం, రమేష్, నామా నరేంద్ర(నాని), ఎంఈవో బాలామణి, నెహ్రూజీ, కళాశాల లెక్చరర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి హామీని నెరవేరుస్తాం : ఎమ్మెల్యే మద్దిపాటి


గోపాలపురంలో 'తొలిఅడుగు' ముగింపు కార్యక్రమంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే

గోపాలపురం, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ అనుభవంతో నిబద్ధత కలిగిన మహోన్నత వ్యక్తి సీఎం చంద్రబాబు అని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. గోపాలపురంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఏడాది పండుగ పేరుతో మండల ముగింపు కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు కొర్లపాటి శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు మ్యానిఫెస్టోలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించి ఇచ్చిన ప్రతిహామీని ఏడాదిలో అమలు చేసి ప్రజలకు అందజేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టు సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళను అవమానించిన ఏ ఒక్కరికీ పుట్టగతులుండవని చరిత్ర చెబుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామతులసి, ఆర్‌అండ్‌ఎం ఫౌండేషన్ అధినేత గంటా మధుకృష్ణ, నల్లజర్ల మండల పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, సమన్వయ కమిటీ సభ్యులు నాగరాజు, హోతా రాజాబాబు, కాట్రగడ్డ సురేశ్, ముత్యాల రాయుడు, విష్ణురాజు, మాజీ మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పసుపు సైనికులే నా బలం

నియోజకవర్గంలో క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన పసుపు సైనికులే నా బలమని అండదండ అని ఎమ్మెల్యే కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. సుపరిపాలనలో తొలి అడుగు ముగింపు కార్యక్రమాన్ని గురువారం అట్టహాసంగా నిర్వహించారు. గోపాలపురంలోని వైజంక్షన్ నుంచి తీన్మార్‌డప్పులు, కేరళ నృత్యాలు, ట్రాక్టర్ల ర్యాలీ, బాణసంచాకాల్పులతో, డీజే సౌండ్స్‌తో వేలాదిగా తరలివచ్చిన టీడీపీ, బీజేపీ, జనసేన నాయకుల భారీ ర్యాలీ వేలాది మందితో చెక్‌పోస్టు సెంటర్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొర్లపాటి రాము, భూరెడ్డి వాసు, జ్యేష్ట శ్రీధర్, వడ్లమూడి రమేశ్, పడమటి శ్రీనివాసరావు, జ్యేష్ట శ్రీనివాసరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలి

గోపాలపురం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేయాలని ఎంపీడీవో జీ. రాజమనోహర్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆరోగ్య సిబ్బందితో ఆయన గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుకుంపేట, అన్నదేవరపేట ఆరోగ్య కేంద్రాల పరిధిలో సుమారు 15000 మందికి నులిపురుగుల నివారణ మాత్రలు వెయ్యాల్సి ఉందన్నారు. ఆయాగ్రామాల్లో ఉన్న అంగన్వాడీ, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొని వేయిం చాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గజ్జరంలో భూ 'రీసర్వే'

తాళ్లపూడి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గజ్జరంలో భూ రీసర్వే ప్రక్రియ పనులు చేపట్టినట్టు తహశీల్దార్ లక్ష్మీలావణ్య తెలిపారు. ఈ మేరకు ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతిరోజూ మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు గ్రామ సర్వేయర్, రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. గ్రామంలోని రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

డ్రోన్లతో స్ప్రేయింగ్

నిడదవోలు, ఆగష్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విధానంలో అధిక విస్తీర్ణాన్ని సాగు చేయడానికి డ్రోన్లు ఎంతగానో ఉపయోగప తాయని జిల్లా ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ రామకృష్ణ అన్నారు. గురువారం కలవచర్ల, కోరుమామిడిలో వరి పొలాల్లో డ్రోన్ సహాయంతో వేప గింజలు, ఇంగువ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖాదికారి జి.సత్యనారాయణ మాట్లాడుతూ ఇలా డ్రోన్ సహాయంతో ఎరువులు పిచికారీ చేయడం వల్ల సమయం ఆదా అవుతుందన్నారు. మండల ప్రకృతి వ్యవసాయ అధికారి విజయలక్ష్మి, గ్రామ సర్పంచ్ హరి, కృష్ణారావు, శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీను, రైతులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొవ్వూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతులు, 11 కేవీబే పొడిగింపు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు నిడదవోలు డివిజన్ ఈఈ ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పట్టణంలోని అన్ని 11 కేవీ ఫీడర్స్‌కు సప్లై నిలుపుదల చేస్తున్నామన్నారు. దీనివల్ల గౌతమీనగర్, ఫ్యాక్టరీరోడ్, మెయిన్‌రోడ్, బజార్, కృష్ణచైతన్యనగర్, శ్రీనివాసపురం, అవంతీ ఫ్యాక్టరీ ఏరియా, గోదావరి బండ్, క్రిస్టియన్‌పేట, శ్రీరామకాలనీ, రాజీవ్‌కాలనీ, స్పెక్ కాలనీలకు విద్యుత్ సప్లై నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు సహకరించాలని ఏఈ డి.జగదీశ్వరరావు కోరారు.

ఎన్ఆర్ఈజీఎస్ పీవోకు వినతి అందజేత

దేవరపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ శ్రామికులకు రావాల్సిన వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్ డిమాండ్ చేశారు. దేవరపల్లిలో గురువారం ఉపాధి కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి, వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎన్ఆర్‌జీఎస్ పీవో శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా భగత్ మాట్లాడుతూ ఉపాధి శ్రామికులకు పని దినాలు 100- 200 రోజులకు పెంచాలని కోరారు. మస్తరు స్లిప్పులు ఇవ్వాలన్నారు. ఏపీవో శ్రీనివాస్ మాట్లా డుతూ ప్రభుత్వం మే 18వ తేదీ వరకు వేతనాలు చెల్లించటం జరిగిందని త్వరలోనే వేతనాలు జరుగుతుం దన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘం నాయకులు ఐనపర్తి శ్రీనివాసరావు, కొడమంచిలి చిరంజీవి, అడపా సూర్యారావు, సత్తిరాజు, తానింకి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అవసరానికి మంచి ఎరువులు వాడొద్దు


వరి సాగులో మెలకువలపై రైతులకు వివరిస్తున్న ఏవో రాజారావు

ఉండ్రాజవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో రసాయనిక ఎరువులు అవసరానికి మించి వాడరాదని మండల వ్యవసాయాధికారి బీ. రాజారావు పేర్కొన్నారు. గురువారం మోర్తలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ప్రతి రైతూ తన పొలంలోని శత్రు, మిత్ర పురుగులను, నీటి వసతి, కలుపు సమస్యలను పరిష్కరించుకోవడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటలను సాగుచేస్తే ఆశించిన ఫలితాలు లభిస్తాయని ఏవో చెప్పారు. అనంతరం వరి సాగును పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు గోదావరిమాతకు శ్రావణపౌర్ణమి నీరాజనం

కొవ్వూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో అఖండ గోదావరి మాతకు శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం మహా నీరాజనం అందజేస్తున్నట్లు గోదావరి నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు తెలిపారు. 239వ మాసోత్సవ మహానీరాజనాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రదోషకాలంలో క్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టంలో వేంచేసియున్న గోదావరి మాత ఆల యం వద్ద అష్టోత్తర శత కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. అనంతరం గోదావరికి వివిధహారతులతో నీరాజనం సమర్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


బియ్యం స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

కొవ్వూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 9,540 కేజీల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ డీఎస్పీ తాతారావు ఆదేశాల మేరకు సీఐ గోపాలకృష్ణ గురువారం కొవ్వూరు గామన్‌బ్రిడ్జి టోల్‌గేట్ సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఇందులో ఏలూరు జిల్లా దెందులూరు నుంచి రాజానగరం వెళ్తున్న ఐషర్ వ్యాన్ ఏపీ 39యుఎఫ్ 4604ను అదుపులోకి తీసుకుని పరిశీలించారు. అనంతరం వ్యాన్‌ను పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని కొవ్వూరు సివిల్ సప్లయిస్ డీటీ ఎం.సునీతకు అప్పగించారు. డ్రైవర్‌పై 6ఏ, 7 కేసులు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు.

దూబచర్లలో పెద్దిరాజు అంత్యక్రియలు

నల్లజర్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూబచర్లలో చెట్టు తొలగింపు విషయంలో తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న దొబ్బిడి పెద్దిరాజు అంత్యక్రియలు గురువారం పూర్తయ్యాయి. అంబేద్కర్ సంఘ నాయకులు, వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీమంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ హోంమంత్రి తానేటి వనిత, మాజీఎమ్మెల్యే జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు విచ్చేసి నివాళి అర్పించారు. రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి వామిశెట్టి పరమేశ్వరరావు, సాలి వేణు, మండలాధ్యక్షుడు వెల్లంకి వెంకటకృష్ణ, మేణ్ని యువరాజు, నక్కా పండు, చిన్ని నాగుయాదవ్, అంబేద్కర్ యూత్ నేతలు పాల్గొన్నారు.

పిల్లలకు ఆల్బెండోజల్ మాత్రలు వేయించాలి

దేవరపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నులి పురుగులు సోకిన పిల్లల్లో రక్తహీనత, కడుపు నొప్పి, వికారం, ఆకలి మందగించటం వంటి లక్షణాలు ఉంటాయని దేవరపల్లి వైద్యాధికారి డాక్టర్ సంజీవ్ పేర్కొన్నారు. దేవరపల్లిలో జాతీయ నులిపురుగుల దినో త్సవం సందర్భంగా గురువా రం జాతీయ నులిపురుగుల దినోత్సవ గోడపత్రికను ఎంపీపీ కేవీకే దుర్గారావు విడు దల చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఏడాది నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించే విధంగా వైద్యాధికారులు, ఉపాధ్యాయులు అవ గాహన కల్పించాలన్నారు. అన్ని పాఠశాలల్లో అంగన్వాడీ సెంటర్లలో అందరికి నులిపురుగు మాత్రలు పంపిణీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజారావు, ఎంఈవో తిరుమలదాసు, యాదవోలు, గౌరీపట్నం ప్రాథమిక వైద్యాధికారులు ప్రశాంత్, ఏ.శ్రీకృష్ణుడు, ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.


గోడపత్రికను విడుదల చేస్తున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు

ఘనంగా సుభాష్, ధన్య వివాహ నిశ్చయ కార్యక్రమం


సుభాష్,ధన్యను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి , టీడీపీ నాయకులు

కొవ్వూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు కుమారుడు సుభాష్, ధన్యల నిశ్చయ తాంబూల కార్యక్రమం రాజమహేంద్రవరం ఎస్‌వీపీసీ కన్వెన్షన్ హాల్-2లో గురువారం ఘనంగా జరిగింది. దీనికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు దంపతులు, అనపర్తి ఎమ్మె ల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొని సుభాష్, ధన్యను ఆశీర్వదించారు. కార్యక్రమం లో ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మాజీ మున్సిపల్ చైర్మన్ జొన్నలగడ్డ రాధారాణి, మద్దిపట్ల శివరామకృష్ణ, అల్లూరి విక్రమాదిత్య, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని సూర్యదేవర రంజిత్, పొట్రు శ్రీని వాస్, ఆళ్ల హరిబాబు, జొన్నలగడ్డ శ్రీనివాస్, నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన కూటమి నేతలు పాల్గొన్నారు.

చెత్త నుంచి వర్మీకంపోస్టు తయారు చేయాలి

ఉండ్రాజవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చెత్త నుంచి వర్మీ కంపోస్టును తయారు చేయాలని కొవ్వూరు డీఎల్‌పీవో ఏ. స్లీవారెడ్డి పేర్కొన్నారు. గురువారం పాలంగిలోని ఎస్‌డబ్ల్యూఎం షెడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్త నుంచి సంపద అనే ప్రక్రియను చేపట్టాలన్నారు. పారిశుధ్య కార్మికుల ద్వారా గ్రామాల్లో ఇంటింటా తడి , పొడిచెత్తను సేకరించాలన్నారు. వీటిని షెడ్డు వద్ద వేర్వేరుగా చేయాలన్నారు. తడిచెత్త నుంచి వర్మీను తయారు చేయాలని స్లీవారెడ్డి సూచించారు. అలాగే గ్రామాల్లో మురిగిడ్రైన్లలో ఎప్పటికప్పుడు సిల్ట్‌ను తొలగించాలని చెప్పారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న స్వమిత్వ సర్వే రికార్డులను పరిశీలించారు. సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీఎస్ రామారావు, ఈవోపీఆర్డీ కె. ఆంజనేయశర్మ, గ్రామసర్పంచ్ బొక్కా శ్రీనివాస్, పంచాయతీకార్యదర్శి ఎండీ హసన్‌జానీ, సిబ్బంది పాల్గొన్నారు. దమ్మెన్ను గ్రామంలో పారిశుధ్య పనులను డీఎల్‌పీవో స్లీవారెడ్డి పరిశీలించి పలు సూచనలు చేశారు.


పాలంగిలో సర్వే రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

పల్లంట్లలో కంటి వైద్యశిబిరం

దేవరపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లంట్లలో నిడదవోలు జాగృతి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీన్ని రాష్ట్ర మానవత సంస్థ కన్వీనర్ గొలుసు సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కంటి వైద్య శిబిరాలు నిర్వహించటం ఎంతో అభినందనీయమన్నారు. జాగృతి కంటి ఆసుపత్రి వైద్యులు జోగిజాన్, సమర్పి సుబ్రహ్మణ్యం, స్థానికులు పిన్నమననేని వెంకటరత్నం, ఆచంట సూర్యనారాయణ, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతిని పరరక్షించుకుందాం

● అంతర్జాతీయ గిరిజన దినోత్సవంలో నన్నయ వర్సిటీ ఉప కులపతి ప్రసన్నశ్రీ


జ్యోతిప్రజ్వలన చేస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, తదితర సిబ్బంది

దివాన్‌చెరువు, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): మౌఖికరూపంలో ఉండే అపారమైన గిరిజన సాహిత్య సంస్కృతి సంపదను సాంకేతిక పరిజ్ఞానంతో పరిరక్షించి భావితరాలకు అందించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్ విభాగం సహకారంతో ఎస్సీ, ఎస్టీ సెల్, విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ గిరిజన దినోత్సవం -2025ను గురువారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన వీసీ మాట్లాడుతూ స్థానిక ప్రజలు, కృత్రిమ మేథస్సు- హక్కులను కాపాడుకోవడం, భవిష్యత్‌ను రూపొందించడం అనే అంశంతో ప్రపంచ గిరిజన దినోత్సవం జరుగుతోందని చెప్పారు. గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లోని భాష, సంస్కృతి, సాహిత్యం ఎంతో ప్రత్యేకమైనవని తెలిపారు. చిన్న, చిన్న గూడాలలో స్వ చ్ఛమైన గిరిజన సాహిత్యం తారసపడుతుందన్నారు. గిరిజనులు వాడుక భాషలో మౌఖికంగా సాహిత్యసేద్యం చేస్తున్నారన్నారు. ప్రకృతితో బంధం ఏర్పరచుకుని రాయిలో కుడా దేవుని చూడగలిగే మంచి మనసున్న వారు గిరిజన పుత్రులు అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గిరిజన ప్రాంతాలలో రహదారులు వేయడం అభినందనీయమన్నారు. పాఠశాలలు, ఆసుపత్రులే అసలైన దేవాలయాలని చెప్పారు. ఐక్యరాజ్యసమితి ప్రకారం అంతరించిపోతున్న భాషలు మౌఖిక చరిత్రలను సంరక్షించడానికి, పూర్వీకుల భూములను మ్యాప్ చేయడం వంటివాటికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడుతుందని అన్నారు. ఆంధ్రగిరిజన వర్గాలు భావితరాలకు సజీవ వారసత్వసంపద అని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి మాట్లాడుతూ నేటి ఆధునిక మానవుల ఆదిమజీవితం ఆదివాసీ గిరిజన ప్రాంతాలలోనే ఆరంభమైందన్నారు. గిరిజన ప్రాంతాలలోనివివిధరకాల సంస్కృతీసంప్రదాయాలు గురించి ప్రస్తావించారు. భారత స్వతంత్ర్య ఉద్యమంలో గిరిజన వీరుల కృషి చిరస్మరణీయమన్నారు. ఈసందర్భంగా గిరిజన సంస్కృతిని ప్రతిబింబిస్తూ కూచిపూడి డిప్లమో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులతో కలసి విశ్వవిద్యాలయ అధికార్లు నృత్య ప్రదర్శన చేసారు. కార్యక్రమంలో సైన్స్‌కళాశాల ప్రిన్సిపాల్ , సదస్సు కన్వీనర్ పి.విజయనిర్మల, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎదురెదురుగా రెండు లారీలు ఢీ

● డ్రైవర్ మృతి.. గొల్లలగూడెం వద్ద ఘటన

దేవరపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొనడంతో డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన గొల్లగూడెం వద్ద గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలివి.. విజయనగరం నుంచి వరంగల్‌కు జిప్సం లోడుతో వెళ్తున్న లారీ గోపాలపురం వైపు నుంచి దేవరపల్లి వైపు వస్తున్న మరో లారీని వేగంగా ఢీకొట్టింది. దీంతో అదుపు తప్పి పక్కన ఉన్న కరెంట్ స్తంభాన్ని తాకి జిప్సం లారీ తిరగబడింది. అలాగే క్యాబిన్ ముందుభాగం నుజ్జునుజ్జైంది. డ్రైవర్ శివనాగరాజు (29) కుడిచెయ్యి శరీర భాగం నుంచి వేరయ్యి దూరంగా పడింది. ముఖమంతా ఛిద్రం అవడంతో గుర్తుపట్టలేని విధంగా తయారైంది. కృష్ణా జిల్లా పెనుమద్రు మండలం యనమలకుదురు ఇందిరా నగర్‌కు చెందిన తాడిపర్తి నాగరాజు జిప్సం లోడుతో వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. శివనాగరాజుకి తండ్రి చిన్నతనంలోనే చనిపోగా, తల్లి లక్ష్మి, అక్క, అన్నయ్య ఉన్నారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.


రోడ్డు పక్కన బోల్తా కొట్టిన జిప్సం లారీ